


సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

కరీంనగర్
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

బుధవారం 1 అక్టోబర్ 2025 | 11 పేజీలు






# స్థానిక ఎన్నికలపై అంతా అయోమయం !



**సూర్య సెంటినరీ కాలనీ**

స్థానిక సంస్థల ఎన్నికలో భాగంగా నిర్వహించే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై ప్రజల్లో ఇంకా సందిగ్ధం నెలకొంది. ఇదిగో తోక.... అదిగో పులి అన్న మాదిరిగా స్థానిక ఎన్నికల తంతు కొనసాగు...తుంది. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికలు ఈసారి మాత్రం ఐదు సంవత్సరాలు దాటిపోయి 20 నెలలు గడుస్తున్న ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో పరిపాలన ఆగిపోయింది. గతంలో 2019 - 2024 మధ్య సర్పంచుల పదవీ కాలంలో 2019-20 మధ్య సమయం ఎన్నికల కోడ్‌తో... 2020-23 మధ్య కాలం 3 సంవత్సరాలు కరోనాతో పరిపాలన కొనసాగలేదు. దీనికి తోడు 2024 లో సార్వత్రిక ఎన్నికలు రావడంతో గత పాలకవర్గంలో పరిపాలన సక్రమంగా జరుగలేదు. పాలకవర్గం ముగిసిన వెంటనే స్థానిక పోరు ఉంటుందని ఆశావాహులు ఎదురు చూసి...చూసి కళ్ళు కాయలు కాసాయని చెప్పవచ్చు. ప్రతి రోజు నేడే, రేపే ఎన్నికలు అంటూ 20 నెలల కాలం గడిచిపోయింది.

2లో..

- అర్థం కాక ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులు
- 20 నెలలుగా ఇదే తంతు
- బిసి రిజర్వేషన్‌పై జి.ఓ.నా ?... ఆర్డినెన్స్?
- ఎంపీ ఈటల స్టేట్మెంట్‌తో మరింత అనుమానాలు

### జిల్లాలో రెండు విడతల్లో జడ్పిటిసి, ఎంపిటిసి స్థానాలకు

# రెండు విడతల్లో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు




- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం
- ఎన్నికల ప్రవర్తన నియమావళి, షెడ్యూల్ పై వివరణ

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

2లో

### పండగ పూట

# విషాదం

- రెండు బైక్‌లు ఢీ
- ఇద్దరు యువకులు మృతి
- ఒకరి పరిస్థితి విషమం

**సూర్య- సుల్తానాబాద్**

దసరా పండుగ పూట సుల్తానాబాద్‌లో విషాదంచోటు చేసుకుంది. మండలంలోని సుద్దాల గ్రామ శివారులో మంగళవారం తెల్లవారు జామున

(మిగతా 2లో)





# స్థానిక ఎన్నికలపై అంతా అయోమయం!

సూర్య, సెంటినరీ కాలనీ

**- ఇక స్థానిక పోరుపై సందిగ్ధం:-**

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై త్వరలో నోటిఫికేషన్ జారీపై ఇంకా సందిగ్ధం నెలకొంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి, గవర్నర్ కి ఆర్డినెన్స్ పంపింది. ఇది అక్కడే పెండింగ్ లో ఉంది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ పై ప్రత్యేక జీఓ తీశారు. దీంతో ఎన్నికల నగారా మోగింది. కోడ్ వచ్చింది. బీసీలకు 42% జీవో చెల్లిందని, సుప్రీంకోర్టులో 50 శాతం మించి రిజర్వేషన్లు ఇవ్వవద్దని తీర్పు ఉందని గుర్తు చేస్తూ, హైకోర్టులో రెడ్డి జాగృతి సంఘం నాయకుడు రిట్ వేశారు. ఈ కేసును ఈ నెల 8వ తేదీకి వాయిదా వేశారు. ఇక ఎన్నికలు తప్పవని రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల 9వ తేదీ నుంచి ఎన్నికల నామినేషన్లకు ఆహ్వానించారు. సుప్రీంకోర్టులో ఒక తీర్పు ఉండగా, హైకోర్టులో మరో తీర్పు ఉండగా ఈనెల 8వ తేదీ స్థానిక పోరుపై ఒక క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. మరోపక్క ఎన్నికలు జరుగుతాయని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తేల్చి చెప్పింది.

**- రిజర్వేషన్లు మారితే ఎలా:-**

ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన జీవో ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేసింది. దీంతో అన్ని గ్రామాలలో రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చాయని నిలబడే అభ్యర్థులు సంతోషంలో ఉన్నారు. ఓట్లు ఎలా వస్తాయి! ఎన్ని పడుతాయి! ఏ సామాజిక వర్గం మనకు మద్దతు ! అనే అంశాలు బేరీజు వేసుకుంటున్నారు. అప్పుడే ఆశావహుల దగ్గరకు పలువురు యువకులు , గ్రామస్తులు వచ్చి నీవే సర్పంచ్ సాబ్, ఎంపీటీసీ సాబ్ అంటూ ఉత్సాహపరుస్తూ, దావతులు అడుగుతున్నారు. మరో పక్క బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఇచిన ప్రకటనతో అంత అయోమయానికి గురి అవుతున్నారు. లీగల్ గా చెల్లుబాటు కానీ ఎన్నికలతో జాగ్రత్త గా ఉండండి, దావత్ లు ఇవ్వకండి. రాజ్యాంగ బద్దంగా లేని జీ. వో లతో నష్టపోకండని హెచ్చరించారు. మహారాష్ట్రలో ఎన్నికలు అయిన తర్వాత సుప్రీంకోర్టు ఎన్నికలు రద్దు చేసిన విషయం గుర్తు చేశారు. దీంతో ఆశావాహుల్లో మరో మారు ఆందోళన మొదలైంది. మళ్లీ రిజర్వేషన్లు మారిపోతే వచ్చే పరిస్థితి ఏమిటని? పునరాలోచనలో అభ్యర్థులు పడ్డారు. అక్టోబర్ 8వ తేదీ వరకు ఆచితూచి అడుగులు వేయాలని నిర్ణయించారు.

## పండగ పూట విషాదం

**(మొదటి పేజీ తరువాయి)**

జరిగిన రోడ్డు ప్రమాదంలో మామ అల్లుళ్లు ఇద్దరు యువకులు మృతి చెందారు. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన స్థానిక సివిల్ ఆస్ప త్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసే అవుట్సోర్సింగ్ ఉద్యోగి ముత్యం రాకేష్ (29), ప్రైవేట్ స్కూల్ లో పనిచేసే పూదరి రోహిత్ అలియాస్ అభి (24), సుగ్లాంపల్లికి చెందిన పాపని ఆదర్శ్ (22) ముగ్గురు స్నేహితులు కలిసి బైక్ పై సుద్దాల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా, మరో బైక్ పై వెళ్తున్న అల్లీపూర్ గ్రామానికి చెందిన గసిగంటి రఘు (21) ఎదురెదురుగా ఢీ కొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే కరీంనగర్ లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రోహిత్ కన్నుమూశాడు, రాకేష్ ఆస్పత్రిలో మరణించాడు. తీవ్రంగా గాయ పడిన మరో ఇద్దరు రఘు, ఆదర్శ్ కరీంనగర్ లో చికిత్స పొందుతున్నారు. కాగా మృతుల్లో రాకేష్ కు రోహిత్ మేనల్లుడు.. ఘటన స్థలాన్ని సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్, జిల్లా లైబ్రరీ సంస్థ చైర్మన్ అన్న య్య గౌడ్ సందర్శించారు. మామా అల్లుళ్ల మృతి చెందడంతో వారి బంధువులు ఆర్తనాదాలు పలువురిని కంటతడి పెట్టించాయి.

### జిల్లాలో రెండు విడతల్లో జడ్పిటిసి, ఎంపిటిసి స్థానాలకు

# రెండు విడతల్లో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు

సూర్య, కరీంనగర్ ప్రతినిధి

స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి, నామినేషన్, ఎన్నికల నిర్వహణ తదితర అంశా లపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతల్లో జడ్పిటిసి, ఎంపిటిసి స్థానాలకు, రెండు విడతల్లో గ్రామ పంచాయతీలకు( సర్పంచ్, వార్డు సభ్యులు) ఎన్నికలు నిర్వహించనున్నామని తెలిపారు. మొత్తం నాలుగు విడతల్లో జిల్లాలో ఎన్నికలు ముగుస్తాయని అన్నారు. మొదటి విడతలో హుజురాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని (6మండలాలు) ఇల్లంతకుంట, జమ్మికుంట, హుజురాబాద్, శంకరపట్నం, వీణవంక, వి సైదాపూర్ మండలాల్లో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.రెండవ విడతలో కరీంనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని (9 మండలాలు) చిగురుమామిడి, చొప్పదండి, గంగాధర, గన్నేరువరం, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, మానకొండూర్, రామడుగు, తిమ్మా పూర్ మండలాల్లో జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు జరుగుతాయని అన్నారు.మూడవ విడతలో కరీంనగర్ డివిజన్ పరిధిలోని మానకొండూర్ మండలం మినహా అన్ని మండలాలల పరిధిలోని గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.నాలుగో విడతలో హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలు సహ మానకొం డూర్ మండల పరిధిలోని గ్రామపంచాయతీ లకు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ఉంటా యని అన్నారు. సర్పంచ్ వార్డు, సభ్యుల ఎన్నిక లకు సంబంధించి పోలింగ్ నిర్వహించిన అదే రోజు ఫలితాలు వెలువడతాయని అన్నారు. జడ్పిటిసి, ఎంపిటిసి ఓట్ల లెక్కింపు నవంబర్ 11న ఉంటుందని అన్నారు.ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలకు ప్రతి మూడు, నాలుగు మండలాలకు ఒక ఆర్ఓ ను నియమిస్తున్నామని, మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని అన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలో ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కళాశాల, అంబేద్కర్ స్టేడియం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ సెంటర్లు, స్ట్రాంగ్ రూములను



ఏర్పాటు చేస్తామని తెలిపారు.గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి అర్హతలు, ధరావత్తు వివరాలు, ఎన్నికల వ్యయం, నామినేషన్ ప్రక్రి య తదితర వివరాలను గురించి అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే వివరించారు .అనంతరం పలువురు రాజకీయ పార్టీల ప్రతిని ధుల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, బిజెపి ప్రతినిధులు నాంపల్లి శ్రీనివాస్, బాస సత్యనారాయణ, వాసాల రమేష్, కాంగ్రెస్ పార్టీ ప్రతిని ధులు సిరాజ్ హుస్సేన్, మడుపు మోహన్, బిఆర్ఎస్ ప్రతినిధి సాతినేని శ్రీనివాస్, సిపిఐ(ఎం) ప్రతినిధి మిల్కూరి వాసుదేవరెడ్డి, సిపిఐ ప్రతినిధి కే.మణికంఠ రెడ్డి, ఏఐఎంఐఎం ప్రతినిధి సయ్యద్ బర్కత్ అలీ, టిడిపి ప్రతినిధి కళ్యాడపు ఆగయ్య, బి.ఎస్.పి ప్రతినిధి సిరిసిల్ల అంజయ్య పాల్గొన్నారు.



### సోలార్ ప్లాంటు నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన అధికారులు

సూర్య, కాల్వ శ్రీరాంపూర్



ప్రధానమంత్రి కుసుం పథ కం ద్వారా ఒక మెగావాట్ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మిం చే స్థలాన్ని అధికారులు మంగళవారం పరిశీలించా రు. మండల కేంద్రంలోని పాండవుల గుట్ట సమీపంలో సర్వే నెంబరు 597లో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే ఒక మెగావాట్ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించినట్లు సింగిల్విండో చైర్మన్ రామచంద్రారెడ్డి తెలిపారు. సుమారు మూడు కోట్ల 50 లక్షల నిధులతో నిర్మించబోతున్నట్లు ఆయన తెలిపారు. పనులు త్వరితగతిన ప్రారంభిస్తామని సింగిల్ విండో చైర్మన్ చదువు రామ చంద్రారెడ్డి తెలిపారు నిర్మాణ స్థలంలో భూమి చదును చేయడం, జంగల్ కటింగ్ తదితర విషయాల గురించి సంబంధిత అధి కారుల సూచన మేం కు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో డిసిఓ శ్రీ మాల, కరీంనగర్ డిసిసిబి సీఈవో సత్యనారాయణ రావు, సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, సీఈఓలు కొల్లేటి శ్రీనివాస్, బోడకుంట్ల విజేందర్, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ కరుణశ్రీ, ఫీల్డ్ ఆఫీసర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

### అమ్మవారికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రత్యేక పూజలు

సూర్య, బీర్పూర్



బీర్పూర్ మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన అమ్మ వారి మండపాల వద్ద మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. బోగ శ్రావణిప్రవీణ్ ప్రత్యేక పూజలు నిర్వహించి ఒడి బియ్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీర్పూర్ మండల అధ్యక్షులు అడెపు నర్సయ్య, జిల్లా దిశా కమిటీ మెంబర్ పాత రమేష్,మహేష్ యాదవ్, ప్రతాప్,కాశేటి తిరుపతి, బద్దల గంగారాజం, దిటి వెంకటేష్ దుర్గాదేవి కమిటీ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

### ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా....

# ఆగని అక్రమ మద్యం అమ్మకాలు

**- పట్టింపు లేని ఎక్సైజ్ అధికారులు**

**- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు**

సూర్య, వీణవంక

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా...వీణవంక మండల కేంద్రంలోని బెల్ట్ షాపుల్లో అక్రమ మద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. అక్టోబర్ 2న గాంధీ జయంతి, పైగా ఎలక్షన్ కోడ్ ఉన్నాగాని ఆ సమయంలో మద్యం విక్రయాలకు బ్రేక్ ఉండడంతో మద్యం అమ్మకదారులు సిండికేట్ గా ఏర్పడి బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు మూడు క్వాటర్లు... ఆరు బీర్లు అన్న చందంగా కొనసాగుతోంది. ఇంత జరుగుతున్నా.. సంబంధిత ఎక్సైజ్ అధికారులు కనీసం తమకు ఏమాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు నెలవారీ మామూళ్ళు వసూలు చేస్తూ సిండికేట్ యజమానులకు సహకరిస్తున్నారని వినికిడి. అయితే గత రెండు రోజుల నుండి తెలంగాణలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో అనధికారిక మద్యం విక్రయాలు ఇంకా జోరందుకోవడం విశేషం. ఒక్కో క్వార్టర్, బీరు బాటిల్పై ఎమ్మార్పీ కంటే అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదంతా.. ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా బెల్ట్ షాపులలో సిట్టింగులు పెట్టుకుంటూ వ్యాపారచనలు చేస్తూన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను పోలీసులు కట్టుదిట్టం చేయకుండా, పట్టించుకోకపోవడం శోచనీయం అంటూ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజకీయ నాయకుల ప్రోత్సాలంతో వైన్స్ షాపుల యజమానులు రెచ్చిపోతున్నారని వినికిడి. బెల్టు షాపుల్లో ఎన్ని బీర్లు కావాలన్నా దొరుకుతున్నాయి. కానీ వైన్స్ షాపుల్లో ఒక బీరు కూడా దొరకడం లేదు. దీనికి ఏంటి సమాధానం అంటూ మందుబాబులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్ షాపుల యజమానులు వైన్స్ షాపులలో వచ్చిన మందులపై స్టిక్కర్లు తీసివేసి అమ్ముతున్నారు. ఎక్కడి వైన్స్ షాపు నుంచి వచ్చినాయి అనేటువంటి ఆధారం లేకుండా వైన్ షాప్ ల యజమానులు బెల్ట్ షాపులకు ఇచ్చే స్టాకుపై స్టికర్లు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. మండల కేంద్రంలో మాత్రం మాకేంటి అన్నట్టు బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలరేగిపోతున్నారు. వీణవంక మండల కేంద్రంలో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉందా లేదా అనే అనుమానం ప్రజల్లో వ్యక్తం అవుతుంది...? ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే కలగజేసుకొని బెల్టు షాపులను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో ఎక్సైజ్ అధికారులు స్పందిస్తారో.... లేక తమకు ఎందుకనే వదిలేస్తారో వేచి చూడాలి.





# రామ రామ ఉయ్యాలో - రామనే శ్రీరామ ఉయ్యాలో..

## - సిరిసిల్లలో కన్నుల పండుగగా సద్దుల బతుకమ్మ - ఆటపాటలతో ఆడి పాడిన ఆడపడుచులు - పూల ధరలకు రెక్కలు



**సూర్య రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి చిహ్నం,రాష్ట్ర పండుగ అయినా సద్దుల బతుకమ్మ పండుగను సిరిసిల్ల పట్టణంలో మంగళవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. నవరాత్రుల పాటు నిత్య పూజలందుకున్న బతుకమ్మలు, చివరి రోజున ప్రత్యేక అలంకరణలతో కనువిందు చేశాయి. మహిళలు, బాలికలు ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మలను నిమజ్జనం చేసి, గౌరమ్మ తల్లి ఆశీస్సులు కోరారు.

**- అంబరాన్నంటిన సంబురం**

సిరిసిల్ల పట్టణంలోని ప్రతి వీధి, వాడ పండుగ శోభతో మెరిసిపోయింది. ఉదయం నుంచే మహిళలు తమ ఇళ్లలో రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయ దుస్తుల్లో ముస్తాబయ్యారు. సాయంత్రం వేళ, వందలాది మంది మహిళలు వివిధ ఆకృతుల్లో, రంగుల్లో అలంకరించిన తమ బతుకమ్మలతో పట్టణంలోని కూడళ్లకు చేరుకొని బతుకమ్మ పాటలతో ఆడి పాడారు. సిరిసిల్లలో ప్రసిద్ధి చెందిన బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్దకు వేలాది మంది బతుకమ్మలు చేరుకోవడంతో ఆ ప్రాంతం జనసందోహంతో కిక్కిరిసిపోయింది. బతుకమ్మల చుట్టూ చేరిన మహిళలు, బాలికలు ఉత్సాహంగా, లయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లతో, నృత్యాలతో హోరెత్తించారు. పత్తి, గుమ్మడి, తంగేడు, గునుగు వంటి పూల పరిమళాలు వాతావరణాన్ని మరింత పవిత్రంగా మార్చాయి.

**- బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు**

సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణంలో బతుకమ్మల నిమజ్జనానికి మునిసిపల్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బతుకమ్మ ఘాట్ తోపాటు నెహ్రూ నగర్,సుభాష్ నగర్,సాయి నగర్ సాయి బాబా దేవస్థానాల వద్ద మానేరు తీరంలో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.పండుగ సందర్భంగా పట్టణంలోని అన్ని ప్రధాన వీధులు, కూడళ్లలో ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేశారు.

**- భక్తిశ్రద్ధలతో నిమజ్జనం**

గంటల పాటు కొనసాగిన ఆటపాటల అనంతరం, మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను శిరస్సున మోసుకుని మానేరు తీరంలో నిమజ్జనం చేశారు. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా మహిళలు తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ప్రత్యేక పాటలు పాడారు. ఈ సందర్భంగా గౌరమ్మకు సమర్పించిన వివిధ రకాల సత్తుపిండి ప్రసాదాలను ఒకరికొకరు పంచుకొని, నోములు పట్టి, పండుగను ముగించారు.

**- పూల ధరలకు రెక్కలు**

సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా పూల ధరలకు రెక్కలు వచ్చాయి. బతుకమ్మ పేర్చడానికి ఉపయోగించే తంగేడు, గునుగు, బంతి, పట్టుకుచ్చుల పూలు అత్యధిక రేట్లు పలికాయి.తెలంగాణ రాష్ట్ర పుష్పం, బతుకమ్మకు అత్యంత ప్రధానమైన తంగేడుపువ్వు అయితే వందల్లో రేటు పలికింది. అయినా ఆడపడుచులు తమకు అత్యంత ప్రధానమైన బతుకమ్మ పండుగ సందర్భంగా పూలను కొనుగోలు చేసి సద్దుల బతుకమ్మ పండుగలో ఉత్సా హంగా పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అధికారులు సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరై, మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తంగా, సిరిసిల్ల సద్దుల బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ, ఉత్సాహవం తమైన వాతావరణంలో బతుకమ్మ వేడుకలు జరిగాయి.







## అమ్మవారి ఆశీస్సులతో...

# ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

## - ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**సూర్య రుద్రంగి**

అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. దేవి శరన్నవరాత్రోత్సవల్లో భాగంగా మంగళవారం రుద్రంగి మండల కేంద్రంలోని మహాలక్ష్మి యూత్, యువ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ఈ సంవత్సరం కూడా సంమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండి ప్రజలందరూ సుఖసంతోషాలతో సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.



అనంతరం యూత్ ఆధ్వర్యలో దుర్గామాత మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దుర్గ మాత నిర్వాహ కమిటీ వారు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఘనంగా శాలువతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత-మనోహర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, గండి నారాయణ, పల్లి గంగాధర్, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, గంధం మనోజ్, సూర యాదయ్య, మోతే నర్సయ్య, దయ్యాల శ్రీనివాస్, గ్రామస్తులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



## అమ్మ వారి సేవలో రాష్ట్ర ప్రభుత్వ విప్ "ఆది"

**సూర్య చందుర్తి**



చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని శరన్నవరాత్రుల సందర్భంగా హిందూ వాహిని వారి ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గ మాత అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు ముస్కు ముకుంద రెడ్డి, ఈసరి శ్రీనివాస్,, పత్తిపాక శంకర్, తిరుపతి, యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

**సూర్య బోయినపల్లి**



ఆస్ట్రేలియా పర్యటన దిగ్విజయంగా పూర్తి చేసుకొని స్వదేశానికి విచ్చేసిన చొప్పదండి ఎమ్మెల్యే సత్యం ను మంగళవారం మర్యాదపూర్వకంగా తడగొండ కాంగ్రెస్ నాయకులు కలవడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ గుడి రాజశేఖర్ రెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ గుడి శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎండి హుస్సేన్, ఆటో యూనియన్ అధ్యక్షులు కొండ శంకర్, కాడే భాస్కర్, వెంకటరమణ, రాజేష్, రఫీ, చంద్రరెడ్డి, చేపూరి లక్ష్మణ్, శంకర్, భూమేష్, ఎర్ర రవి, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అమెరికాలో బతుకమ్మ పండుగ వేడుకలు

**- తెలంగాణ ఆడపడుచుల సంబరాలు**

**సూర్య వేములవాడ**



తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను అమెరికా లోని ఆస్టిన్‌లో హిందూ టెంపుల్ కమ్యూనిటీ పార్క్‌లో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా అత్యంత కోలాహలంగా కన్నుల పండు గగా బతుకమ్మ పండుగ వేడుకలను నిర్వహించారు. బతుకమ్మ సాంప్రదాయ పాటలతో మహిళలు, చిన్నారులు, యువతులు చిన్న పెద్ద తేడా లేకుండా అందరు ఆటపాటలతో డిజె సప్పులతో బ్యాండ్ బాజాలతో ఎంతో హుషారుగా బతకమ్మ పండగ వేడుకలు అంబరాన్నంటాయి. భారతదేశం నుండి వచ్చిన స్థానికుల తల్లిదండ్రులు, బంధువులు కూడా ఈ వేడుకలలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని కమిటీ సభ్యులు తమ సంతోషాన్ని తెలియజేశారు. ఈ సంబరాల్లో ఆస్టిన్ స్థానికులతో పాటు ఎంతో మంది అతిథులు ఎన్నారైలు నివసిస్తున్న తెలుగు వారందరికీ స్థానికులకు బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను తెలియజేస్తు బతుకమ్మ వైభవాన్ని చాటిచెప్పుతూ తెలంగాణ కల్చరల్ సొసైటీ చరిత్రలో నిలిచిపోవడం జరిగిందని సొసైటీ సభ్యులు అన్నారు. ఇతర సంస్థలు కూడా బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.

## జోగాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యం...

**- కేసు నమోదు**

**సూర్య చందుర్తి**



చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన మట్టెల తిరుపతి అను వ్యక్తి సోమవారం రోజున బతుకమ్మ చూడడానికి వెళ్లి, మళ్లీ ఇంటికి తిరిగి రాలేదని, చుట్టుపక్కల వెతికినా కూడా ఆచూకీ లభించలేదని, తన తల్లి మట్టెల భాగ్యవ్వ ఇచ్చిన పిర్యాదు మేర కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఒక ప్రకటనలో చందుర్తి ఎస్సై జె రమేష్ తెలిపారు.

## రానున్న ఎన్నికల్లో యువతకు టికెట్లు ఇవ్వాలి

**సూర్య హుజురాబాద్**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ యువతి, యువకులకే టిక్కెట్లు ఇచ్చి అవకాశాలు కల్పించాలని హుజురాబాద్ నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మిడిదొడ్డి రాజు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న యువతను గుర్తించి ఎక్కువ సంఖ్యలో టికెట్లు ఇవ్వాలని అన్నారు. యువతకు టికెట్లు ఇవ్వడం వల్ల రాబోయే తరం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు అవుతుందని అన్నారు. అధిష్టానం ఈ విషయాన్ని గుర్తించి రాజకీయాల్లో యువతకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

# ఎన్నికల కోడ్ నియమావళి పాటించాలి

## - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నియమావళి పాటించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సోమవారం నుండి ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన గోడ వ్రాతలు, గోడ పత్రికలు, ఫ్లెక్సీ బ్యానర్లు తొలగించవలసిందిగా ఆయా పార్టీల ప్రతినిధులను కోరారు. ఎన్నికలు జరుగు ప్రాంతాల్లో అనుమతులు లేని సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు లోబడి అనుమతులు తీసుకొని సమావేశాలు, గోడ వ్రాతలు, గోడ పత్రికలు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా కోరారు. అదేవిధంగా రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయడం జరుగుతుందని తెలిపారు. ఏదైనా ఎన్నికల సమయంలో జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.కంట్రోల్ రూమ్ నెంబర్: 96662 34383, అన్ని రాజకీయ వర్గాల ప్రతినిధులు ఎన్నికల నియమావాళి తూ.చ తప్పకుండ పాటించాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి రాజా గౌడ్, జడ్పీ సీఈఓ గౌతంరెడ్డి, డిపిఓ మదన్మోహన్, సంబంధిత అధికారులు పలు రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అమ్మవారి సేవలో పాల్గొన్న కల్వకుంట్ల విద్యాసాగర్ రావు దంపతులు

**సూర్య కోరుట్ల టౌన్**



కోరుట్ల పట్టణంలోని శ్రీ దుర్గా దేవాల యం(కాలేజీ గ్రౌండ్)లో నవరాత్రోత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ నాయకులు,కోరుట్ల నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు కల్వకుంట్ల విద్యా సాగర్ రావు-సరోజమ్మ దంపతులు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యాసాగర్ రావు-సరోజమ్మ దంపతులను శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు,తీర్థప్రసాదాలు అంద జేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ నాయకులు, కోరుట్ల నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు-సరోజమ్మ దంపతులతో పాటు మాజీ కౌన్సిలర్ పెండెం గణేష్,దగ్గుల నర్సయ్య,గుడ్ల శీను,గెల్లే గంగాధర్,ఎక్కాల్ దేవి నవీన్,ఊరడి నరేంధర్ తదితరులు పాల్గొన్నారు.

## బి సి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా సూర వినోద్

**సూర్య బీర్పూర్**



బీర్పూర్ మండలం తుంగూరుకు చెందిన సూర వినోద్‌ను బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాండభేరి నరేష్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజాల శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాజుల నాగరాజు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగం జలజ, జిల్లా ప్రధాన కార్యదర్శి భూమి రమణ, బాగోజి ముకేశ్ ఖన్నా, ఒంటిపులి రాము, వరద సాయి, వేముల వినోద్ పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ అమల్లోకి...

**- వాహన తనిఖీలు ప్రారంభం**

**సూర్య ఇబ్రహీంపట్నం**



ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గండి హనుమాన్ చెక్‌పోస్ట్ వద్ద ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మంగళవారం నుండి వాహన తనిఖీలు ప్రారంభమయ్యాయి. ఎలాంటి ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో డబ్బు లేదా మద్యం రవాణా చేసినట్లయితే వాటిని సీజ్ చేస్తామని ఎస్సై అనిల్ తెలిపారు.

## మత్తుకు యువత దూరంగా ఉండాలి

**సూర్య ఎలిగేడు**



గ్రామీణ ప్రాంతాల్లోని యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా దూరంగా ఉండాలని ఎలిగేడు ఎస్సై మధుకర్ తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. దసరా పండుగను ప్రజలందరూ శాంతియుతంగా కుల మతాలకు అతీతంగా సామరస్యంతో జరుపుకోవాలని చెప్పారు. గ్రామాల్లో నిర్వహించుకునే జమ్మి వేడుకలు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అందరూ సహకరించాలన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటు, స్పెషల్ డ్రైవ్ చేపట్టిందన్నారు గంజాయి డ్రగ్స్ సేవించడం సరఫరా చేయడం విక్రయించడం పండించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి వేళల్లో యువకులు రహదారుల వెంట బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ఇతరులకు ఇబ్బందులు కల్పించవద్దన్నారు. మద్యం మత్తులో వాహనాలను వేగంగా నడిపిస్తూ ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని, ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. మత్తుకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఇలాంటి ఘటనాలపై గ్రామాల్లోని యువజన సంఘాలు పోలీసులకు సహకరించి మత్తు నియంత్రణలో 100 డయల్, ఎలిగేడు పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.వో 8712659268 మొబైల్ నెంబర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

## అమ్మవారి పల్లకిసేవ

**- ప్రత్యేక పుజలు నిర్వహించిన భక్తులు**

**సూర్య ఇబ్రహీంపట్నం**



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బజరంగ్దళ్ సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో మంగళవారం భక్తులకు అమ్మవారు దుర్గ మాతగా దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా భవాని దీక్ష పరులు, భక్తులు అమ్మవారికి వివిధ రకాల అలంకరణ చేసి అర్చకుల సహకారంతో పంచామృత అబిషేకాలు, అష్టోత్తరాలు తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు కప్పగంటి మహేష్ శర్మ నిర్వహించారు.పంచహారతులు, నక్షత్ర హారతులను భక్తులు స్వీకరించారు. అమ్మవారి పల్లకిసేవ గ్రామ పురవీధుల్లో జరిగింది. మండపంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బజరంగ్ ధళ్ సేన అధ్యక్షుడు సున్నం రాజేష్, ఉపాధ్యక్షుడు పుప్పాల మహేష్, కోశాధికారి మగ్గిడి రవి, సలహదారు రెడ్డవేన అజయ్ కుమార్, కార్యనిర్వాహకుడు చాట్ల నిలయ్, సోషల్ మీడియా ఇంచార్జి గోల్లపెల్లి రాజవిక్రంత, భవాని దీక్ష స్వాములు, భక్తులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి

**సూర్య జగిత్యాల అర్బన్**



జగిత్యాల పట్టణం లోని శ్రీ లోక మాత పోచమ్మ తల్లి దేవాలయం లో మంగళవారం నాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని అమ్మవారిని మాజీ మంత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు మాజీ మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఆలయ కమిటీ సభ్యులు ములస్తం మునిందర్, నాయకులు రమేశ్ రావు, రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, రవీందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ వన్ సాధించిన ప్రతిభను సన్మానించిన గ్రామస్తులు

**సూర్య సారంగాపూర్**



సారంగాపూర్ మండలంలోని అర్పపల్లి గ్రామా నికి చెందిన దొంగరి ప్రతిభ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం గ్రూప్ వన్ ఫలితాల్లో డిఎస్పీగా ఉద్యోగం పొంది సోమవారం గ్రామానికి రాగ స్థానిక మాల కుల సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రతిభ గ్రామంలో ఊరేగింపుగా ర్యాలీ తీసి అనంతరం సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రూప్ వన్ సాధించిన ప్రతిభ మాట్లాడుతూ చదువుకోవడం ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవలసిన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండబెట్ల ప్రసాద్,మండల రామన్న,కొండ ప్రభాకర్,ఎండబెట్ల గాబ్రియేల్, అప్పం స్వామి, కొండ మురళి, ప్రభాకర్, సుగుణాకర్, జగత్, కిషోర్, జయకర్, విజయ్, సంతోష్, లింగయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## నవ దుర్గ పీఠ క్షేత్రంలో అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు

**సూర్య జగిత్యాల టౌన్**



దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జగిత్యాల పట్టణంలోని స్థానిక గోవింద పల్లె లో శ్రీ నవదుర్గ పీఠ క్షేత్రంలో అమ్మవారిని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా.బోగ శ్రావణి ప్రవీణ్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా దిశా కమిటీ మెంబర్ పాత రమేష్, జగిత్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, కాశట్టి తిరుపతి, దూరిశెట్టి మమత, కౌడు వెంకన్న, మామిడాల కవిత రాజగోపాల్, బద్దెల గంగారాజం నవదుర్గ సేవా సమితి సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన జువ్వాడి కృష్ణారావు

**సూర్య కోరుట్ల టౌన్**



నియోజకవర్గ కేంద్ర మైన కోరుట్ల పట్ట ణంతోపాటు, మండలంలోని పైడిమడుగు, జోగినపల్లి గ్రామాలలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రతిష్టించిన అమ్మ వారి మండపాలలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయా గ్రామాల్లో జరిగిన అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు వెంట కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్,మాజీ కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం,ఆడెపు మధు,అన్నం అనిల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి,జనార్ధన్,సైదు గంగాధర్,రాజేశం తదితరులు పాల్గొన్నారు.



సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

పెద్దపల్లి

బుధవారం 1 అక్టోబర్ 2025




# దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**సూర్య-గోదావరిఖని**

శరన్నవరాత్రుల్లో భాగంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఏర్పాటుచేసిన దుర్గామాత విగ్రహాలను స్థానిక శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో సింగరేణి కార్మికులు వారి కుటుంబాలు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఇక్కడి సింగరేణి సంస్థకు చెందిన ఏరియా వర్క్‌షాప్ ఆలయంలో నిర్వహించిన దుర్గామాత ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజల శాంతి, సమృద్ధి, ప్రాంత అభివృద్ధి కోసం ఆ అమ్మవారిని



ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి, దుర్గామాత చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రామగుండం ఏరియా-1 జీఎం డి.లలిత్ కుమార్, డిప్యూటీ జీఎం జితేందర్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా జిడికె-11వ బొగ్గు గని ప్రాంగణంలో కొలువుదీరిన దుర్గామాతకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రామగుండం ఏ పవర్ హౌస్ కాలనీలో జై దుర్గా మాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. అనంతరం ఎన్టీపీసీ పరిధిలో ఏర్పాటు చేసిన బ్రదర్స్ యూత్, త్రిశూల్ యూత్, హిందూ వాహిని, భవాని యూత్, హిందూ యువ వాహిని ఆధ్వర్యంలో దుర్గా మాత మండపాలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

# ప్రశాంత వాతావరణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు

## - ఎంపీడీవో అల్లం పూర్ణచందర్ రావు



**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో మహిళలు ప్రశాంత వాతావరణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం అభినందనీయమని కాల్వ శ్రీరాంపూర్ ఎంపీడీవో అల్లం పూర్ణచందర్ రావు పేర్కొన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకున్నట్టు అదేవిధంగా దసరా వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. జిల్లా కలెక్టర్ కలెక్టర్ ఆదేశాలను ఈనెల 27న పంచాయతీ కార్యదర్శులతో సమన్వయ సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. సమావేశంలోని సూచనల మేరకు పంచాయతీ కార్యదర్శులు అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య పనులు నిర్వహించి బతుకమ్మ ఆడే ప్రాంగణం, పరిసర ప్రాంతాలలో అవసరమైన చోట్ల మొరం పోయించి, ట్రాక్టర్ బ్లేడు సహాయంతో చదును చేయించారని, అలాగే విద్యుత్ దీపాలతో అలంకరించి, త్రాగునీటి వసతి కల్పించారన్నారు. కలెక్టర్ అందజేసిన 50, 100 వాట్స్‌ల LED బల్బులను వీధి దీపాలుగా, బతుకమ్మ ఆడే ప్రాంగణంలో అమర్చారని, బతుకమ్మ నిమజ్జనం చేసే ప్రాంతంలో చెరువులోకి దిగడానికి ఏర్పాట్లు చేసి, హైమాస్టు లైట్లను అమర్చారన్నారు. బతుకమ్మ నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక యువతకు అవగాహన కల్పించారని, ఆది నుండి ప్రత్యేక చొరవ తీసుకొని ఎలాంటి అపశృతి జరగకుండా అన్ని ఏర్పాట్లు దగ్గరుండి చేసిన పంచాయతీ కార్యదర్శులను, ప్రత్యేక అధికారులను ఎంపీడీవో అల్లం పూర్ణచంద్రరావు అభినందించారు.

## కల్వచర్లలో బతుకమ్మ మెగా లక్కీడ్రా ఆకట్టుకుంది

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా శ్రీ సాయి జ్యువెలర్స్ గోదావరిఖని వారి సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో బతుకమ్మ పేర్చిన ప్రతి ఆడపడుచుకి లక్కీ డ్రా కూపన్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులుగా మొదటి బహుమతి గ్రాము బంగారు దుర్గామాత ప్రతిమ, రెండవ బహుమతి అర గ్రాము బంగారు దుర్గామాత ప్రతిమ, మూడవ బహుమతి తులం వెండి బతుకమ్మ విజేతలను దసరా రోజు కల్వచర్లలోని వేణుగోపాల స్వామి ఆలయం ప్రాంగణంలో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి బహుమతులు అందజేస్తారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి యాదవ్ మాటాడుతూ తెలంగాణ ఆడపడుచుల ప్రతిభ, భక్తి, ఆనందానికి ప్రతీక బతుకమ్మ. ప్రతి ఇంటిలో సాంప్రదాయాలను నిలబెట్టే ఈ పండుగను ఘనంగా జరపడం మన అందరి బాధ్యత. లయన్స్ క్లబ్ మహిళల భాగస్వామ్యాన్ని



ప్రోత్సహిస్తూ, గ్రామాభివృద్ధి కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ముందుకు తీసుకువెళ్తుందని పేర్కొన్నారు. మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ అనేది తెలంగాణ సాంప్రదాయాలకు అద్దం పట్టే అద్భుతమైన పండుగ. మహిళలంతా ఐక్యతగా, ఆనందంగా జరుపుకునే ఈ పండుగ మన సంస్కృతిని నిలబెడుతుంది. ఇటువంటి కార్యక్రమాలను శ్రీ సాయి జ్యువెలర్స్ వారి సహకారంతో లయన్స్ క్లబ్ వంటి సంస్థలు ముందుకు వచ్చి సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలకు అండగా నిలవడం గ్రామానికి గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, గ్రామ ప్రజలు,మహిళలు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీసులకు సన్మానం

**సూర్య-గోదావరిఖని**

పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను మంగళవారం ఇక్కడి కమిషనరేట్ కార్యాలయంలో రామగుండం కమిషనరేట్ అడిషనల్ అడిషనల్ డీసీపీ(అడ్మిన్) కె.శ్రీనివాస్ ఘనంగా సన్మానించి సత్కరించారు. పదవి విరమణ పొందుతున్న వారిలో ఆర్ఎస్ఐ ఆర్.శ్రీహరి, ఏఎస్ఐ బి.భాస్కర్, ఏఆర్ ఎస్ఐ కె.రమేష్, హెడ్ కానిస్టేబుల్ సిహెచ్.లక్ష్మయ్య ఉన్నారు. పోలీసు శాఖలో సుదీర్ఘమైన సేవలో అందించి, శాంతి భద్రతల పరిరక్షణలో శత్రువులపై యుద్ధం చేసిన సందర్భాలను వారు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడు తూ ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడంలో పోలీసులకు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందని వారి తోడ్పాటు వల్లనే విధులను సమర్థవంతంగా నిర్వర్తించి ఉన్నత స్థానాలను అధిరోహించడం జరుగుతుందని అన్నారు. పదవి విరమణ పొందుతున్న పోలీసులు ఇకపై కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఆనందంగా గడపాలని సూచించారు. ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పదవి విరమణ పొందిన అధికారులను ప్రభుత్వ వాహనంలో ఇంటి వరకు సాగనంపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, రిజర్వ్ ఇన్స్పెక్టర్‌లు దామోదర్, శ్రీనివాస్, వామన మూర్తి, మల్లేషం, సూపరింటెండెంట్‌లు ఇంద్ర సేనా రెడ్డి, సందీప్, సిసి హరీష్, కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం,స్వామి పాల్గొన్నారు.



## రైతుల సంక్షేమమే సింగిల్ విండో ధ్యేయం

**సూర్య- సుల్తానాబాద్**



రైతుల సంక్షేమమే సింగిల్ విండో ధ్యేయం అని సహకార సంఘం చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ సహకార సంఘం 131వ సర్వ సభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అడిట్ రిపోర్ట్‌ను సభ్యులు ఆమోదించి, సభ్య రైతులకు 6% డివిడెండ్ రూపంలో 16,70,888/- రైతులకు చెక్కుల ద్వారా అందజేశారు. రైతుల ఉత్పత్తి సంస్థ ప్రగతి, భవిష్యత్ కార్యక్రమాలు, రైతులకు కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా చైర్మన శ్రీనివాస్ మాట్లాడుతూ సమాఖ్య వనరులను పారదర్శకంగా వినియోగించి, రైతుల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడుతున్నామని, సహకార సంఘాల బలోపేతం ద్వారా రైతులు ఆర్థికంగా బలపడతారని ఎఫ్ పీవోల ద్వారా మరిన్ని అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ యన్. వెంకటేశ్వర్లు, పాలక వర్గ సభ్యులు పన్నాల రాములు, సురేష్ రెడ్డి, గోపయ్య, రాజయ్య,ఓదెలు, కమలమ్మ, పోచమ్మ, పద్మ, లక్ష్మయ్య, సుగుణకర్, సిఇవో బూరుగు సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

**- కాల్వశ్రీరాంపూర్ ఎస్సై వెంకటేష్**

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వ శ్రీరాంపూర్ మండల ప్రజలందరు దసరా పండగను ప్రశాంత, స్నేహబావ వాతావరణంలో జరుపుకోవాలని కాల్వ శ్రీరాంపూర్ ఎస్ ఐ వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో సంతోషగా అందరితో కలసి మెలసి జరుపుకోవాలని కోరారు. ఇతరులకు ఇబ్బందికర కార్యకలాపాల కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అదే విధంగా గత కొంతకాలం నుండి కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో బతుకమ్మ, జమ్మిపూజలు చాలాకాలం నుండి సంస్కృతి వేదజల్లె విధంగా జరుపుకుంటున్నారన్నారు. అదేవిధంగా ప్రజలు ప్రజాసంక్షేమం కోసం మంచి ఉద్దేశ్యంలో పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు.

## పది తులాల అమ్మవారి వెండి ప్రతిమ అందజేత

**సూర్య, సెంటినరీ కాలనీ**



ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో కమాన్పూర్ మండలంలో కొలువైన అమ్మవారు దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భక్తుల కోరికలు తీర్చే తల్లిగా, వరములిచ్చే అమ్మగా ప్రాచుర్యం పొందిన మన అమ్మవారి ఖ్యాతి పక్క మండలం రామగిరి భక్తుల నమ్మకంతో, లక్కారం గ్రామ నివాసి అయిన దొరిశృతి - కుమార్ గౌడ్ 10 తులాల దుర్గాదేవి వెండి ప్రతిమను అందించారు. ఆ యొక్క అమ్మవారి ప్రతిమకు పురోహితులు గడియారం వేణు మాధవ్ అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ యొక్క పూజా కార్యక్రమంలో చత్రపతి శివాజీ యువసేన నాయకులు, భవానిలు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**సూర్య యైటింక్లయిన్ కాలనీ**



రామగుండం నియోజకవర్గం 8వ కాలనీలో సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పాల్గొని మహిళా సోదరీమణులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గణేష్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గామాతను దర్శించుకుని ప్రాంత ప్రజల ఆరోగ్యం, సుఖసంతోషాలు కోరుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ ప్రాంత అభివృద్ధి కోసం అందరూ తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండేటి రాజేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మారెల్లి రాజిరెడ్డి, శంకర్ నాయక్, ఐరెడ్డి సంపత్ రెడ్డి, జక్కుల దామోదర్, సాగంటి శంకర్, సట్ల సదానందం, మార్క రాజు, దేవనపల్లి చక్రపాణి, రేషవేణి కేశవులు, అనుము రాములు, మెరుగు రాజేష్, పరకాల ప్రశాంత్, గఫూర్ బాదే ధోనీ తదితరులు పాల్గొన్నారు.

## రాంలీలా కార్యక్రమాన్ని నిర్వహించకుండా

# మార్క్ ఫెడ్ గేట్‌కు తాళం వేయడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ నిరసన




**సూర్య కరీంనగర్**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ లోగల మార్క్ ఫెడ్ మైదానంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత 15 ఏళ్లుగా దసరా రోజున నిర్వహించే రాంలీలా కార్యక్రమాన్ని నిర్వహించకుండా మార్క్ ఫెడ్ గేట్‌కు తాళం వేయడాన్ని నిరసిస్తూ.. బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరి శంకర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు గేట్ ఎదురుగా ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. గేట్ ముందర బయటయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్లా హరిశంకర్ మాట్లాడుతూ..గత 15 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తున్నామని కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కావాలని అడ్డుకోవాలని చూస్తోందన్నారు. కరీంనగర్ లో కాంగ్రెస్ పార్టీకి కనీసం ఒక్క కార్పొరేటర్ కూడా లేదని ఎద్దేవా చేశారు. ఇది పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమమని దీన్ని జరిపే బాధ్యత గణేష్ ఉత్సవకమిటీదని వారన్నారు.గతంలో ఎన్నడు ఇలాంటి ఇబ్బందులు ఎప్పుడూ ఎదురుకాలేదని ఇప్పుడు మాత్రం కావాలని కాంగ్రెస్ నాయకులు ఆటంకం కల్పిస్తున్నారని ఆరోపించారు.మార్క్‌ఫెడ్ డి.ఎంకి, సుడా చైర్మన్‌తో పాటు మంత్రి ఫోన్ చేసి వేడుకలు జరపకుండా చూడాలని ఆదేశించినట్టు వారు ఆరోపించారు. వందలాది మంది పోలీసులను మోహరించిన సరే ఈ కార్యక్రమం జరుగుతుందని హెచ్చరించారు.ఈ విషయంలో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని ఉత్సవ కమిటీతో చర్చించి అనుమతులు కల్పించాలని లేని పక్షంలో ప్రజలే తాళాలు పగులగొట్టి కార్యక్రమం జరుపుకుంటారనీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఇది హిందువుల ఆధ్యాత్మిక కార్యక్రమనీ.. దీన్ని అడ్డుకోవాలని చూస్తే..ప్రజలే గేట్ తాళాలు పగలగొట్టి వేడుకలు చేసుకుంటారని హెచ్చరించారు. ఈ సాయంత్రంలోగా స్పష్టత ఇవ్వాలన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్య వస్తే మాకు బాధ్యత ఉండదనీ, పోలీస్ కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలన్నారు హిందువుల మనోభావాలు దెబ్బతీయడం తగదనీ కరీంనగర్‌లో 15 చోట్ల ఉత్సవాలు జరుగుతున్నాయని కానీ ఇక్కడ మాత్రమే అడ్డుకోవడంలో ఏంటి అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్‌తో పాటు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్లు పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, రెడ్డవేణి మధు కొత్తపెల్లి మండలం మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్,డివిజన్ మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్లు పార్టీ డివిజన్ అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ

### - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల జిల్లాలో ప్రశాంతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు విడతలలో స్థానిక సంస్థలను, రెండు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో మొదటి విడతలో 10 మండలాలు, రెండవ విడుదల 10 మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల జరుగుతాయని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ అదనపు భద్రత బలగాలు ఉండేలా చూడాలని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల జరిగిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే ఎన్నికలు జరిగే గ్రామీణ ప్రాంతాలలో అమలులోకి రావడం జరుగుతుందని అన్నారు. ఎం.సి.సి నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యలను చేపట్టి మండల అధికారులు రిపోర్ట్ అందించాలని అన్నారు.ఓటర్లను ప్రభావితం చేసేలా ఎంసిసి నిబంధనలకు విరుద్ధంగా అర్బన్ ప్రాంతాలలో, సోషల్ మీడియా ద్వారా ఉల్లంఘనలు చేస్తే వారిపై ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని, సిబ్బందికి ఎన్నికల విధుల నిర్వహణ పట్ల శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని, శాంతి భద్రతలు కూడా అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన వసతులు ఉన్నాయో లేదో చెక్ చేయాలని అన్నారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించాలని అన్నారు. మండల కేంద్రాలలో నామినేషన్ స్వీకరణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియ పై సిబ్బందికి శిక్షణ అందించాలని అన్నారు. పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనల, విధులపై అధికారులకు ముందుగానే సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పోటీలో ఉండే అభ్యర్థులు ఫైనల్ అయిన తర్వాత బ్యాలెట్ పేపర్ల ముద్రణ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు ఒక నోడల్ అధికారి నియమించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా రి-పోల్ జరగకుండా పటిష్ట ఏర్పాట్లు ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజా గౌడ్ , జెడ్పీ సిఈఓ గౌతమ్ రెడ్డి, డిపిఓ మదన్ మెహన్ జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలలో ఎన్నికల "కోడ్" అమలు

**- పెద్దపల్లి డిసిపి కరుణాకర్**

**సూర్య, సెంటినరీ కాలనీ**



స్థానిక ఎన్నికలలో "ఎన్నిక కోడ్" అమలైందని పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ అన్నారు. మంగళవారం సెంటినరీ కాలనీలో స్థానిక ఎన్నికల సందర్భంగా ఆయన పోలీస్ అధికారులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలు అవుతున్న దృష్ట్యా పోలీసులు నిఘా పెంచాలని సూచించారు. రూ.50 వేలకు మించిపోకుండా డబ్బులు ఎవరైనా వెంట తీసుకెళ్లవద్దని కోరారు. మద్యం బాటిళ్లు కూడా మించి ఉండరాదని తెలిపారు. చట్టాన్ని ఎవరైనా చేతులలోకి తీసుకెళ్లుతే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో జిడికే ఏసీపీ మడత రమేష్, మంథని సిఐ బి.రాజు, టూ టౌన్ సిఐ నక్క ప్రసాద్ రావు, రామగిరి ఎస్సై టి.శ్రీనివాస్, మంథని ఎస్సై రమేష్, ముత్తారం ఎస్ఐ ఎన్.రవికుమార్, కమాన్ పూర్ ఎస్ఐ కొట్టే ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల కోసం సిద్ధమైన బీజేపీ

**- నేడు కరీంనగర్ కు రాష్ట్ర అధ్యకుడు రామచంద్రరావు**

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**

**సూర్య కరీంనగర్**



స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చాటి చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి పిలు పునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికల కోసం మంగళవారం రోజునబిజెపి ముఖ్య నేతలతో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ద్వారానే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి అభివృద్ధి పనులపై విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని తెలిపారు.అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రశ్నించాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత పాలనపై ప్రజలకు వివరించాలని తెలిపారు. పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయడానికి బుధవారం రోజున రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు కరీంనగర్‌కు వస్తున్నారని ఆయన తెలిపారు.

## గంజాయి విక్రేతలను పట్టుకున్న కరీంనగర్ రూరల్ పోలీసులు

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ వద్ద వాహన తనిఖీల సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.వీరి వద్ద నుంచి ప్రభుత్వం నిషేధించిన 5 కిలోల 20 గ్రాముల గంజాయి, ఒక జూపిటర్ మోటార్ సైకిల్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.అరెస్టు అయినవారిలో నలిమెల వినోద్ (28), కుక్కలగూడూర్, పాలకుర్తి మండలం, పెద్దపల్లి జిల్లా కొండ్ర ప్రశాంత్ (21), మానకొండూర్ గ్రామం,మండలం రోడ్డ సాయి అఖిల్ (21), సాయి నగర్, మానకొండూర్, కరీంనగర్ జిల్లా ఉన్నారు.విచారణలో నిందితులు కొత్తగూడెం నుండి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, విద్యార్థులు, హమాలీలు, లారీ డ్రైవర్లకు అధిక ధరలకు విక్రయించాలన్న యత్నంలో ఉన్నట్లు వెల్లడైంది. ప్రధాన నిందితుడు వినోద్ గతంలో పలు సార్లు గంజాయి కేసుల్లో అరెస్ట్ అవ్వగా, జైలు శిక్ష కూడా అనుభవించినప్పటికీ తిరిగి నేరచర్యలకు పాల్పడినట్లు తెలిసింది.నిందితులను రిమాండ్‌కు పంపించగా, ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ఇన్స్పెక్టర్ ఏ.నిరంజన్ రెడ్డి,ఎస్సై నరేష్, సిబ్బందిని కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ ఆలం అభినందించారు.

## ఎంపీడీవోగా ఎంపికైన నరేష్‌ను అభినందించిన ఎమ్మెల్యే

**సూర్య తిమ్మాపూర్**




టీజీపీఎస్ గ్రూపు -1 ద్వారా ఎంపీడీవోగా ఎంపికై సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం పొందిన రామడుగు మండలం రుద్రారం గ్రామానికి చెందిన నాగం నరేష్‌ను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించారు. మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసేందుకు విచ్చేసిన నరేష్‌కు ఆయన శాలువా కప్పి సన్మానించారు. ప్రస్తుతం పోలీసుశాఖలో ఆర్ఎస్ఐగా నిజామాబాద్ జిల్లాలో పని చేస్తున్న నరేష్ గ్రూపు-1 పరీక్ష రాసి ఎంపీడీవోగా ఎంపికయ్యారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నరేష్‌తోపాటు ఆయన తండ్రి లక్ష్మిరాజం, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్, డీహెచ్ పీఎస్ జిల్లా అధ్యక్షుడు గంగిపల్లి శంకర్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.రుద్రారం గ్రామానికి చెందిన నాగం లక్ష్మిరాజం-నర్సమ్మ దంపతుల కుమారుడైన నరేష్‌కు ముగ్గురు అక్కలు కూడా ఉన్నారు.

## బతుకమ్మ సంబరాల విజేతలకు బహుమతులు అందచేత

**సూర్య, చొప్పదండి**



చొప్పదండి పట్టణంలోని 13వ వార్డులో బతుకమ్మ సంబరాలు సందర్భంగా బ్రాహ్మణ అర్చాక పురోహిత సంఘం అధ్యక్షుడు శ్రీమాన్ తులసి ప్రభాకరచార్యులు ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో విజేతలను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, 15 కన్సోలేషన్ బహుమతులు అందచేశారు. ప్రథమ బహుమతి అర్థవేళ్ళి జ్యోత్స్న శ్రీనివాస్,ద్వితీయ మరిమడ్ల లక్ష్మి పోశమల్లు, మూడవ మరిమడ్ల పద్మ మెహన్ గేలుపోందారు.అలాగే రమాలత బీరయ్య,చుక్కా, అమరగోండ సంధ్య,దండే లత సురేష్, మంద విజయ అంజయ్య, తిరునహరి సావిత్రి సత్యనారాయణ లు లక్కిడ్రాలో గేలుపోందారు. ఏస్వీజేసీ డైరెక్టర్ సింహాచలం హరికృష్ణ, ముందఅంజయ్య, సింహాచలం ప్రభాకర్ చార్యులు పెద్దిరాములు, పెద్ది శ్రీనివాస్ మరిమడ్ల రాజిరెడ్డి చేతులమీదుగా అందజేశారు.కార్యక్రమంలో మాత, యంగ్ బాయ్స్ యూతుక్లభ్ సభ్ పాల్గోన్నారు.

## ముందే మందు కొనుక్కోండి




అక్టోబర్-02న గురువారం గాంధీ జయంతి రోజున మద్యం దుకాణాలు బంద్. ఇదే రోజు దసరా కావడంతో ముందుగానే బుధవారం మందు కొనుక్కోండని మద్యం షాపు యజమానులు బ్యానర్లు కట్టడం, వాట్సప్ గ్రూప్‌లలో ప్రచారం చేస్తున్నారు.

**పివీరావు,**
**సూర్య, సెంటినరీ కాలనీ**

# ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మానం

**సూర్య కరీంనగర్**




కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో వివిధ హోదాల్లో సుదీర్ఘ కాలం పాటు విశేష సేవలందించి మంగళవారంనాడు పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులను కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ఘనంగా సన్మానించారు.పదవీ విరమణ పొందిన వారిలో కరీంనగర్ సి.ఎస్.బి. లో ఎస్సైగా పనిచేసిన ఆర్.రవీందర్ రెడ్డి (42 సంవత్సరాలు), టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న ఎన్. భాస్కరచారి (42 సంవత్సరాలు), కరీంనగర్ రూరల్ పిఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా కె.వెంకటేశ్వర్లు పనిచేస్తున్న (35 సంవత్సరాలు) లు ఉన్నారు. వీరంతా తమ ఉద్యోగ జీవితంలో పోలీసు శాఖకు అంకితభావంతో సేవలందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ ఒక సాధారణ ప్రక్రియ అని, అయితే అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. పోలీసు అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని ఆయన గుర్తుచేశారు. పదవీ విరమణ పొందుతున్న అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అనంతరం, పోలీస్ కమీషనర్ స్వయంగా పదవీ విరమణ పొందుతున్న అధికారులను పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. వారికి జ్ఞాపికలను అందజేసి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీం రావు రిజర్వు ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్(సంక్షేమం), కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దుర్గా అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ మండలం నగునూర్‌లోని పరివార సమేత శ్రీదుర్గాభవానీ ఆలయంలో దుర్గాభవానీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రులలో 9రోజైన మంగళవారం దుర్గాభవానీ అమ్మవారు దుర్గా అలంకరణలో సింహ భక్తులకు దర్శనమిచ్చారు, ఆలయ ప్రధానార్చకులు పవనకష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చి పూజలు నిర్వహించారు. చతుషష్ట్యుపచార పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీరెసారె పెట్టి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. చండీహోమం నిర్వహించి అమ్మవారికి గంగా హారతులిచ్చారు. అమ్మవారి సన్నిధిలో మహిళలు సౌందర్యలహరి పారాయణం చేశారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మెన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటీ బాధ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి, మాజీ కార్పోరేటర్లు వంగళ శ్రీదేవి, అన్నప్రసాద ట్రస్టు బ్యాధ్యులు పల్లెర్ల శ్రీనివాస్, తొడుపునూరి వేణుగోపాల్, పడకంటి వినోద్ కుమార్, మోటూరి అంజనేయులు భక్తులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు టీఎన్జీవోలు జేఏసీ పండుగ శుభాకాంక్షలు

**సూర్య కరీంనగర్**



తెలంగాణ ఎన్జీవో సంఘము జిల్లా అధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు గౌరవ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ ఆలం, ఐపీఎస్‌ని మర్యాదపూర్వకంగా కలిసి సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సి.పి.ని శాలువా, పుష్పగుచ్చం, మెమెంటో, స్వీట్లు అందజేసి సాంప్రదాయబద్ధంగా సన్మానించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల విశిష్టతను వివరించి, ప్రతి సంవత్సరం టీఎన్జీవోల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఉద్యోగులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రాజేష్ భరద్వాజ్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఏ.వి. రాజేశ్వరరావు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కోట రామస్వామి, శంకర్ కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

**- వెలిచాల రాజేందర్ రావు**

**సూర్య కరీంనగర్**



స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు సూచించారు. బిజెపి, బీఆర్ఎస్ పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.మంగళవారం చేర్యుర్తి, శ్రావణపల్లి, బహదూర్ ఖాన్‌పేట గ్రామాల్లో పర్యటించిన ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వమే పేదలకు అండగా నిలుస్తోందని, ఇందుకు నిదర్శనమే నాలుగు వేల ఇందిరమ్మ ఇండ్ల మంజూరు అని చెప్పారు.ఎన్నికల నిబంధనలను పాటిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించి ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పడాలని ఆయన కోరారు.

## ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రవంతమ్మ దంపతుల ఆధ్వర్యంలో వారి నివాసంలో గల శ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయ అమ్మవారు.శ్రీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజున భక్తులకు శ్రీ దుర్గాదేవి రూపాన దర్శనమిచ్చారు. వేకువజామునే అర్చకులుచే ప్రత్యేక పూజలు ఆలయంలో నిర్వహించారు. మహాచండి రూపంలో భక్తుల అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## గాంధీ జయంతి రోజు జీవహింస చేస్తే కఠిన చర్యలు

**సూర్య హుజురాబాద్**

ఈనెల 2వ తేది గురువారం రోజున గాంధీ జయంతిని పురస్కరించుకొని హుజురాబాద్ మున్సిపల్ పరిధిలో జీవహింస చేయరాదని హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ కేంసారపు సమ్మయ్య అన్నారు. జాతిపిత జయంతి సందర్భంగా ఎలాంటి జీవహింస చేయరాదని, నిబంధనలు అతిక్రమించిన మాంసం వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం

**సూర్య కరీంనగర్ టౌన్**



కృషి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నుండి భద్రత సూచనలు, వాటి నివారణకు ప్లకార్డులతో అవగాహన కార్యక్రమం చేసినారు.కరపత్రాలను పంపిణీ చేసినారు.కృషి యూత్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ దసరా పండుగకు యువత, ప్రజలు మద్యం సేవించి రోడ్డు మీదికి రావద్దని మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలకు గురి కావద్దని ఇతరులను రోడ్డు ప్రమాదాల గురి చేయవద్దని, రోడ్డు ప్రమాదాలు జరిగితే కుటుంబాలు రోడ్డున పడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో కృషి యూత్ అసోసియేషన్ ప్రతినిధులు,బండారి చంద్రయ్య, దుర్గం శ్రీనివాస్, దుర్గం శేఖర్, జాడి అశోక్, గోల్డ్ రాజు, రాజగోపాల్ రెడ్డి, జాడి బాల రెడ్డి, దుర్గం సాయి, సుధీర్ కుమార్, నరేష్, దీటి శ్రీనివాసు, పందరి బి శ్రీనివాస్, శ్రీహరి, విష్ణు, షఫీ, అనిల్, బహదూర్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## వారణాసిలో సద్దుల బతుకమ్మ సంబరాలు

**సూర్య హుజురాబాద్**



ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు సోమవారం రాత్రి జరిగాయి. విశ్వవిద్యాలయంలోని బిర్లా మందిర్ వద్ద తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, లెక్చరర్లు బతుకమ్మలు పేర్చి ఒకచోటపెట్టి ఆడుకున్నారు. 109 సంవత్సరాల సుధీర్ఘ చరిత్ర కలిగిన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పండుగైన బతుకమ్మ ఉత్సవాలు చేయడం ఇదే మొదటిసారి జరిగిందని హుజురాబాద్ మండలం రాంపూర్ కు చెందిన డాక్టర్ గోసికొండ శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జె.బి. కొమురయ్య, డాక్టర్ గట్ల ప్రవీణ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## దుర్గామాత మండపాల వద్ద మహా అన్నదాన కార్యక్రమాలు

**సూర్య వీణవంక**



దుర్గామాత ఉత్సవాలు గ్రామాల్లో, పట్టణాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించబడుతున్నాయి. వీణవంక మండల కేంద్రంతో పాటు నర్సింగాపూర్, వల్భాపూర్ గ్రామాలలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కురుమవాడ దుర్గా మాత, వల్భాపూర్ హనుమాన్ టెంపుల్ వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు,గ్రామ ప్రజలు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సభ్యుల సహకారంతోనే సొసైటీ అభివృద్ధి

**సూర్య జమ్మికుంట**



జమ్మికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 84వ సాధారణ సర్వసభ సమావేశము అధ్యక్షులు పొనగంటి సంపత్ అధ్యక్షతన సీడ్ ప్లాంట్‌లో నిర్వహించారు.సంపత్ మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధి బాటలో ఉండడానికి కారణ సంఘ సభ్యులు రైతులు తీసుకున్న అప్పులను సకాలంలో చెల్లించి సహకరిస్తున్నారని ప్రశంసించారు.వారికి ప్రభుత్వం నుండి 3% వడ్డీ కూడా ప్రభుత్వం రాయితీ ఇస్తుందని సభ్యులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సొసైటీ తరఫున రైతులకు మరిన్ని సేవా కార్యక్రమాలు జరుపుదామని తెలిపారు.సమావేశానికి సంఘం ఉపాధ్యక్షులు మామిడి తిరుపతి రెడ్డి,సభ్యులు మురుపాయల తిరుపతిరావు,పోల్సాని లింగరావు,గుజ్జు రాజశేఖర్ రావు,బిట్ల రమాదేవి,పోతుల సమ్మయ్య కుమార్, తక్కలపల్లి రాధిక, ఎజ్జ తిరుపతి, పింగిలి శ్రీలత, మల్రెడ్డి రాజయ్య, సంఘం సీఈవో వి రవీందర్, సంఘం సిబ్బంది పాల్గొన్నారు

## ముత్తారం గుడి హుండీల నుండి రూ. 25వేల దొంగతనం

**సూర్య శంకరపట్నం**



శంకరపట్నం మండలం ముత్తారం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎల్లమ్మ, మల్లన్న గుడి తలుపులు తెరిచి హుండీలలోని సుమారు రూ. 25,000 నగదును దొంగలించారు. ఈ సంఘటనపై బొంగుని రవీందర్ (49) ఫిర్యాదు చేయగా ఎస్ఐ శేఖర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగతనాల నివారణకు దేవాలయాలు, ఇళ్ళు, వ్యాపార ప్రాంగణాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులు సూచించారు. ఇలాంటి సంఘటనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తెలిపారు.

## చెట్ల తొలగింపుపై మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ రేకుర్తి 17వ డివి జన్ విజయదుర్గ కాలనీ రోడ్ నం.2 నుండి జగిత్యాల రోడ్డులోని వి పార్క్ హోటల్-బాలాజీనగర్ వైపు వెళ్లే రహదారిపై ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్లు, పొదలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. వాహనాలు, నడిచే ప్రజలకు ఇబ్బందులు ఏర్పడటమే కాకుండా పండుగల సమయంలో మరింత కష్టాలు ఎదురవుతున్నాయని స్థానికులు తెలిపారు. ఈ సమస్య పరిష్కారార్థం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. రహదారి ఇరువై పులా పెరిగిన చెట్లను తొలగించి రాకపోకలకు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి శంకర్, దుర్గం మోహన్, గొల్ల శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో జడ్పీటిసి ఆశావాహుల సందడి..

## - అధిష్టానం ఎవరికి అవకాశం దక్కెను...
## - రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఆశావహులు
## - గ్రామాల్లో పోటా పోటీ కార్యక్రమాలతో సందడి

**సూర్య, వీణవంక**



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఆశావహులు గ్రామాల్లో పోటా పోటీ కార్యక్రమా లతో సందడి చేస్తున్నారు. గత కొన్ని సంవత్స రాలుగా పదవులను ఆశిం చిన నేతలంతా ప్రజల్లో పరపతి పెంచు కోవడం కోసం పోటీ పడుతున్నారు. అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ నాయ కులు ప్రతి మండలం నుంచి జడ్పీటిసి లుగా నలుగురు పోటికి సిద్ధమవు తున్నారు. గెల్లు శ్రీనివాస్ యాదవ్, చిన్నాల ఐలయ్య యాదవ్, సాహెబ్ హుస్సేన్, పంజాల సతీష్ గౌడ్,ప్రతిపక్ష పార్టీ నుంచి రాయిశెట్టి శ్రీనివాస్, అడిగొప్పుల సత్యనారాయణ, జడల రమేష్, నీల కుమార స్వామిలు ఏ మాత్రం తగ్గకుండా అధికార పార్టీ నాయకులతో పోటీ పడుతున్నారు. హుజురాబాద్ నియోజకవర్గం వీణవంక మండలంలో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు రానున్న జడ్పీటిసిల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తూ ఓటర్లతో కలిగోలుపుగా తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ స్థాయిలో తమకున్న ఓటు బ్యాంకు తగ్గకుండా చూడటానికి విశ్వప్రయత్నాలు చేపడుతున్నారు. అధికార పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్నటువంటి సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో ప్రచారానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో ఓటు పెంచేందుకు సర్వ ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాల్లో అలజడి మొదలు కాగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలతో ముందుకు వస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతూ కార్యకర్తలతో ప్రతి గ్రామంలో పరిచయం ఉన్న నేతలను బరిలో దింపి తమ పంతం నెగ్గించుకునేందుకు బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ బడా లీడర్లు పోటీ పడుతున్నారు. దీనికి తగ్గట్టుగానే బిజెపి కూడా తమ స్థాయిలోనే పోటీ పడనున్నాయి. బిజెపి పార్టీ నుండి ఎనగంటి శ్రీనివాస్ యాదవ్, బత్తిని నరేష్ గౌడ్, పుప్పాల రఘు, నరసింహ రాజు, అమృత ప్రభాకర్ పేర్లను మండలంలో పలువురు చర్చించుకుంటున్నారు

### - ఆర్థిక సహాయాలు...

పలు పార్టీల నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల వేళ ప్రజలకు చేరువయ్యేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రతి గ్రామంలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శిస్తూ, ఆర్థిక సహాయాలు చేస్తూ పోటీపడుతున్నారు. గడప తొక్కిన ఇరు పార్టీల నాయకులను ఓటర్లు గౌరవంగా చూస్తూ ఫోటోలు దిగుతున్నారు. పరామర్శలు, ఆర్థిక సహాయం చేసిన ఫోటోలు వాట్సాప్ గ్రూప్ లో పోటా పోటీగా షేర్ చేస్తున్నారు. కానీ ఎన్నికల వేళ ఏ పార్టీని ఆదరిస్తారో వేచి చూడాల్సిందేనని పలువురు అనుకుంటున్నారు.

### - రిజర్వేషన్లు వెలువడడంతో నేతల వ్యూహా రచనలు...

ఇంతకాలం ఎలాగైనా రిజర్వేషన్లలో టికెట్ సంపాదించి గెలిచి తీరాలని కలలుగంటున్న కొందరి నేతలకి ఆశలు అడియాశలు అయ్యాయి. మరి కొంత మంది నాయ కులకు వరంగా మారాయి. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ లు కీలకంగా మారాయి. కాగా గ్రామాల్లో పరపతి కోసం ఆరాటపడుతున్న నేతలంతా రిజర్వేషన్ వెలువ డంతో గ్రామాల్లో తమ పలుకుబడితో ఓటు బ్యాంకును పెంచుకుంటున్నారు. గణపతి, దుర్గామాత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా యువకులను ఆకట్టుకునేందుకు కార్యక్రమాలు చేస్తున్నారు. దీంతో యువకులు స్థానిక ఎన్నిక లను దృష్టిలో ఉంచుకుని బరిలో ఉండే పలు పార్టీల నేతలను కలిసి లబ్ది పొందుతున్నారు. ఏది ఏమైనప్పటికి రానున్న ఎన్నికల్లో జెడ్పిటిసి సీటు ఎవరికి వరిస్తుందో వేచి చూడాలి.

# స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

## - కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని కరీంనగర్ పోలీస్ కమీషనర్ (సీపీ) గౌష్ ఆలం, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలోని కాన్ఫెరెన్స్ హాలులో సీపీ అధ్యక్షతన పోలీసు అధికారులతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (Model Code of Conduct) అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో తక్షణం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని సీపీ తెలిపారు. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని, నవంబర్ 11 వరకు ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుందని వివరించారు. వెంటనే కమీషనరేట్ కేంద్రంలో ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని, దీనికి అనుభవజ్ఞులైన అధికారులను, సిబ్బందిని కేటాయించామని తెలిపారు. ఈ సెల్ కమీషనరేట్ వ్యాప్తంగా అధికారులకు సమన్వయకర్తగా వ్యవహరిస్తుందన్నారు. అతి త్వరలో 6 అంతర్-జిల్లా చెక్ పోస్టు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, ఈ చెక్ పోస్టుల వద్ద ముమ్మర వాహన తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.గత ఎన్నికల సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, ఎన్నికల నేరస్థులను, రౌడీ షీటర్లను ఆయా రెవెన్యూ అధికారుల ముందు బైండ్ ఓవర్ చేయాలని సూచించారు. సరైన ఆధారాలు లేకుండా ?50,000 కంటే ఎక్కువ నగదును వెంట తీసుకువెళ్లరాదని, ఈ నిబంధన ఉల్లంఘిస్తే అట్టి మొత్తాన్ని సీజ్ చేయాలని సీపీ ఆదేశించారు.నామినేషన్ల స్వీకరణ నుంచి ఎన్నికల నిర్వహణ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సీపీ సూచించారు. ఎన్నికల హ్యాండ్‌బుక్‌లోని ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని, అనుమానాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు కేటాయించే పోలీసు అధికారులకు అవసరమైతే శిక్షణ కూడా అందిస్తామని చెప్పారు.



### - దసరా, దుర్గా దేవి నిమజ్జనం బందోబస్తు...

రానున్న దసరా పండుగ సందర్భంగా కమీషనరేట్ వ్యాప్తంగా రామ్ లీలా మైదానాలు మరియు దేవి నిమజ్జనం కొరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు కమీషనర్ గౌష్ ఆలం అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున, రాజకీయ అల్లర్లు జరగకుండా నివారించడానికి అవసరమైన పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు.





# నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి

## - రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కలెక్టర్ హరిత
## - స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికారులకు ఎంసీసీపై శిక్షణ

**సూర్య రాజన్న సిరిసిల్ల.**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ హరిత ఆదేశించారు.స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్( ఎంసీసీ)పై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరిత హాజరై మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన కూడదని స్పష్టం చేశారు. విధుల్లో భాగంగా ఎఫ్ఎస్, ఎస్ఎస్టీ లు సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజ్ తీసుకోవాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచించారు.ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత రూ. 50 వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తే పట్టుకొని, వీడియో తీసి పంచనామా చేయాలని, అనంతరం పట్టుకున్న డబ్బుకు సంబంధించి రసీదు అందజేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలకు అనుమతి ఇవ్వడం, వాటిని పరిశీలించడంపై వివరించారు. ఆయా మండలాల నోడల్ ఆఫీసర్లు తమ నివేదికను ప్రతి రోజు పంపించాల్సి ఉంటుందని తెలిపారు. ఎంసీసీ నోడల్ ఆఫీసర్ గా డీఆర్డీఓ శేషాద్రి నియమించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఉంటాయని తెలిపారు.సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాధాభాయ్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, డీపీఓ షర్ఫుద్దీన్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ పాటల పల్లకి పుస్తకాన్ని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ వాస్తవ్యురాలు అనంతోజు పద్మశ్రీ రచించిన బతుకమ్మ పాటల పల్లకి పుస్తకాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ తెలంగాణ జానపదుల హృదయ స్పందనను పాటల రూపంలో రచించి 'బతుకమ్మ పాటల పల్లకి' పుస్తకాన్ని వెలువరించిన కవియిత్రి అనంతోజు పద్మశ్రీ అభినందనీయురాలన్నారు.. తెలంగాణ ప్రాంతీయ సంస్కృతిని పద్మశ్రీ అద్భుతంగా అక్షరబద్ధం చేశారని, తెలంగాణ సంప్రదాయాలకు పట్టం కట్టే ఇటువంటి మరిన్ని రచనలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కవయిత్రి కుటుంబ సభ్యులు జూపాక మల్లేశం, శాలిని, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాదేవి(సిద్ధిదాత్రి) అవతారంలో అమ్మవారు

**సూర్య కరీంనగర్**



శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మహాశక్తి దేవాలయంలో తొమ్మిదవ రోజు మంగళవారం, దుర్గాష్టమి సందర్భంగా శ్రీ దుర్గాదేవి (సిద్ధిదాత్రి) అవతారంలో, రత్నాల అలంకరణలో శ్రీ మహాదుర్గ అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు.శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారు, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ మహాసరస్వతి అమ్మవార్ల ప్రత్యేక అలంకరణ చేసారు.

# పార్టీ అభ్యర్థుల విజయానికి గులాబీ సైన్యం సిద్ధం

## - కాంగ్రెస్ హామీల అమలు జాడ ఎక్కడ...?- హుజురాబాద్ లో గులాబీ జెండా విజయం ఖాయం

## - ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**సూర్య, హుజురాబాద్**

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో హుజురాబాద్ నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం నాతో సహా గులాబీ సైన్యం సిద్ధంగా ఉందని, వారి సహకారంతో హుజురాబాద్ లో గులాబీ జెండా ఎగరేస్తామని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మంగళవారం హుజురాబాద్ పట్టణ శివారులోని కేసి క్యాంపులో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 42 శాతం బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని బిఆర్ఎస్ పార్టీ కోరిందని, బిల్లుకు కూడా శాసనసభలో మద్దతు ఇచ్చిందన్నారు. ఒకవైపు ఈ విషయం కోర్టులో ఉండగా ప్రభుత్వం తాము బిసిలకు ఏదో చేశామని ప్రజలకు చెప్పడానికి ఒకవేళ కోర్టు ఎన్నికలను ఆపమని చెబితే ఆ అపవాదు ప్రతిపక్షాలపై వేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించాల్సిన ప్రభుత్వం కేవలం బిసిలను మభ్యపెట్టడం కోసం ఆదరాబాదరాగా పనిచేస్తే కోర్టు మొట్టికాయలు వేసినా కూడా ప్రభుత్వం మొండిగా నోటిఫికేషన్ వేయించిందన్నారు. రాజ్యాంగబద్ధంగాలేని నోట ఫికేషన్ చెల్లదని, ఈనెల 8 వరకు పోటీదారులంతా ఓపిక పట్టాలన్నారు. ఒకవేళ ఎన్నికలు జరిగినా పదవి ప్రమాణం చేసిన నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న ప్రభుత్వ చట్టాలను కోర్టు తొలగించమని ఎప్పుడైనా చెప్పవచ్చని, గతంలో మహారాష్ట్రలో రెండు సంవత్సరాలు పదవిలో ఉన్న వ్యక్తులందరిని పదవులను త్యాగం చేయాలని కోర్టు ఆదేశంతో వారంతా తమ పదవులను కోల్పోయారని అన్నారు. ప్రభుత్వం కేవలం బిసిల సానుభూతి పొందడం కోసం, ప్రభుత్వం ఏదో చేసిందని చెప్పుకోవడం కోసం మాత్రమే ఈ తతంగం అని ఆయన అన్నారు. అనాదిగా హుజురాబాద్, కమలాపూర్ నియోజకవర్గాలు టిఆర్ఎస్ కు కంచుకోటగా ఉండేవని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని 107 గ్రామ పంచాయతీలో 62 ఎంపిటిసిలలో ఐదు జెడ్పిటిసిలు, ఐదు ఎంపిటిసిలు అన్ని వార్డు సభ్యుల సీట్లలో బిఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆయన అన్నారు. వారి విజయం కోసం తాను నియోజకవర్గం అంతా పర్యటించి కృషి చేస్తానన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు వచ్చిన తర్వాత గ్రామపంచాయతీలలో అనేక మార్పులు వచ్చాయన్నారు. మాజీ సిఎం కేసీఆర్ పరిపాలన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఉత్తమ గ్రామపంచాయతీలకు అవార్డులు ఇస్తే 20 లో 18 తెలంగాణ గ్రామ పంచాయతీలున్నాయన్న విషయం విధితమే అన్నారు. నాటి సిఎం కేసీఆర్ పరిపాలనలో ఈ అవార్డులు రావడం కేంద్రం సైతం రాష్ట్రాన్ని ప్రశంసించినట్టేనని అన్నారు.



**- హామీల అమలు జాడ ఎక్కడ...?**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలు, హామీలు ఇచ్చిందని, ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ వాటిని తుంగలో తొక్కిందన్నారు. హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత కేసిఆర్ ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలను నేటి ప్రభుత్వం కేవలం కేసిఆర్ కు పేరు, ప్రఖ్యాతులు వస్తాయని అనే కుట్రతో చాలా పథకాలను నిలుపుదల చేసిందని అన్నారు. ప్రజలు ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీల అమలు జాడ ఎక్కడ అని నిలదీయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నియమించిన అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని, దానికి కార్యకర్తలంతా కృషి చేయాలని అన్నారు. ఆడబిడ్డలకు తులం బంగారం, రైతులకు పూర్తి రుణమాఫీ, చదువుకునే అమ్మాయిలకు స్కూటీలు, మహిళలకు రూ. 2500, రైతులకు రైతు భరోసా, ఇలా అనేక వాగ్దానాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన చేతకాక చేతులెత్తేసిందని అన్నారు. జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి నిరుద్యోగుల ఓట్లు పొందిన కాంగ్రెస్ మర్చిపోయిందన్నారు. రైతులకు యూరియా అందించలేని మొద్దు ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నారు. నాటి సిఎం కేసీఆర్ పరిపాలనలో ఒక్క రైతు కూడా యూరియా బస్తాల కోసం రోడ్డు పైకి రాలేదని, కాంగ్రెస్ పార్టీ హయాంలో యూరియా దొరకక రైతులు తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. నాటి (కేసిఆర్) పాలనలో రైతులు రాజుగా ఉంటే నేటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో రైతులకు కష్టాలు తప్పడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్న విషయాన్ని గ్రహించిన ప్రభుత్వం జరగని ఎన్నికలు, అమలు గాని రిజర్వేషన్లను ఇచ్చి ప్రజలను మభ్యపెడుతుందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ఇచ్చిన హామీల విషయంలో విఫలమైన విషయం గురించి బాకీ కార్డుల పేరుతో ప్రజల్లో ప్రచారం చేస్తామని అన్నారు.

**- ఈనెల 4 నుండి కార్యకర్తల సమావేశాలు...**

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు గాను కార్యకర్తలను, కార్యోన్ముఖులు చేసే ఉద్దేశంతో ఈనెల 4 నుండి కార్యకర్తల సమావేశాలు మండలాల వారీగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 4న ఉదయం వీణవంకలో, సాయంత్రం హుజురాబాద్ లో, 5న ఉదయం ఇల్లందకుంటలో, సాయంత్రం జమ్మికుంటలో, 6న కమలాపూర్ మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు, ఈ సమావేశానికి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, నాయకులు రవీందర్ రెడ్డి, తిరుపతి రావు, రాజేశ్వర రావు, కొండాల్ రెడ్డి, పింగిలి రమేష్, రామస్వామి, ఇరుమల్ల సురేందర్ రెడ్డి, కిరణ్, పుల్లాచారి, మనోహర్, బెల్లి రాజయ్య, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రత్నాపూర్‌లో బోనాల జాతర

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి జాతర జరిగింది. నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గాదేవి నిర్వాహకులు బోనాల పండుగను నిర్వహించారు. రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాల నుండి బొడ్రాయి వరకు మహిళలు బోనాలు నెత్తిమీద పెట్టుకుని డప్పులతో ఊరేగింపుగా వెళ్లారు. ఢిల్లీ లో నివాసం ఉండే గ్రామానికి చెందిన ప్రముఖ ఇంజనీయర్ సుంకరి సత్యనారాయణ దుర్గాదేవి నిర్వాహకులకు తనవంతుగా రూ.10 వేల విరాళం అందించారు. పోతురాజు, తదితర వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు, మాజీ ఎంపిటిసి దర్మూల రాజసంపత్, ప్రముఖ ఇంజనీయర్ సుంకరి సత్యనారాయణ,స్థానిక నాయకులు ఉడుత శంకర్,కొప్పుల రవీందర్ రావు, బర్ల శ్రీకాంత్, జక్కుల చందన్ కుమార్, పబ్బ వెంకటేష్, జక్కుల మహేష్, నగునూరి సతీష్, ముక్కెర మోహన్, కెక్కర్లమోహన్, బైన సంపత్, సందవేన కుమార్, ధర్మూల వర్షిత్, ముక్కెర వినయ్, కెక్కర్ల అరవింద్, చెలుకల ఆదిత్య, బైన ఓదెలు, కెక్కర్ల అశోక్, సింగరవేన రవి, దాసరి మల్లి, బండి సాయి, కెక్కర్ల రమేష్, కండె రాజేందర్, ముడుసు వంశీ, కేశవేన మల్లేష్, లక్కీ తిరుపతి, గసిరెడ్డి నాగరాజు,ముక్కెర అక్షయ్, దాసరి మాణిక్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం సెంటనరీ కాలనీ కి చెందిన మౌంటైనేర్ మాస్టర్ లెంకల వివేకానంద రెడ్డి వారి తండ్రి ఇంటర్నేషనల్ మౌంటినీర్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హెూల్డర్ లెంకల మహిపాల్ రెడ్డి వీరిద్దరూ కలిసి యూరప్ ఖండంలోనే అత్యంత ఎత్తైన శిఖరం అయినటువంటి మౌంట్ ఎల్బ్రస్ (5642 మీటర్లు)అనే పర్వతాన్ని 03 ఆగస్టు2025 వ తేదిన అధిరోహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మత్తు పదార్థాల పట్ల అవగాహన కలిపించే సే నో టూ డ్రగ్స్ అనే బ్యానర్‌ని పర్వతంపై ప్రదర్శించడం జరిగింది, కాగా తెలంగాణ నుంచి పర్వతాన్ని అధిరోహించిన మొట్టమొదటి తండ్రి కొడుకులుగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌ను తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి ఎన్నో పర్వతాలు అధిరోహించి జిల్లాకు మరియు రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కోరారు. కాగా ఈ సందర్భంగా మాస్టర్ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ ఇచ్చిన ప్రోత్సాహంతో మరిన్ని విజయాలు సాధిస్తానని తెలిపారు. విజయం సాధించిన తండ్రీకొడుకులను పెద్దపల్లి జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ రెడ్డితో పాటు పలువురు అధికారులు అభినందించారు.

## పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు

# జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉంది

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

పెద్దపల్లి జిల్లాలో స్థానిక సంస్థలు (గ్రామ పంచాయతీలు, ఎంపిటిసి, జడ్పిటిసి) ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పత్రికా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంపీటీసీ జడ్పిటిసి స్థానిక సంస్థలను రెండు విడతలలో మరియు గ్రామ పంచాయతీ ఎన్నికలు రెండు విడతలలో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ షెడ్యూల్ విడుదల చేసిందని, అదే ప్రకారం పెద్దపల్లి జిల్లాలో ఎన్నికలు జరుగుతాయని అన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున గ్రామీణ ప్రాంతాల్లో ఎం.సి.సి కోడ్ అమలు కావడం జరుగుతుందని అన్నారు.పెద్దపల్లి జిల్లాలో మొత్తం 13 మండలాల్లో 263 గ్రామ పంచాయతీలు, 2432 వార్డులు, జిల్లా వ్యాప్తంగా 2432 గ్రామ పంచాయతీ పోలింగ్ స్టేషన్లు, 273 పోలింగ్ లోకేషన్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఓటర్ల వివరాల ప్రకారం పురుషులు 198728, మహిళలు 205439, ఇతరులు 14 మంది కలిపి మొత్తం 404181 మందికి ఓటు ఇవ్వడానికి అవకాశం ఉందని, ప్రతి విడతలో మండల వారీగా గ్రూప్ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ కు అనుగుణంగా నామినేషన్, పరిశీలన, పోలింగ్ తేదీలు నిర్ణయించామని అన్నారు. స్థానిక సంస్థ ఎన్నికలకు సరిపడా ఏర్పాట్లు, ఇంచార్జి నియామకాలు, బ్యాలట్ బాక్స్‌లు, పోలింగ్ బూత్‌లు, పార్టీ ప్రతినిధులతో సంప్రదింపులు, షెడ్యూల్ వివరాల అనుసరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అన్ని పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో పాటు స్థానిక నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, నియమాల ప్రకారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సన్నద్ధంగా ఉందని అన్నారు.పోలింగ్ కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన వసతులు ఉన్నాయో లేదో చెక్ చేస్తున్నారని, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయిస్తామని అన్నారు.మండల కేంద్రాలలో నామినేషన్ స్వీకరణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ అందిస్తామని తెలిపారు. పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనల, విధుల పై అధికారులకు ముందుగానే సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పోటీలో ఉండే అభ్యర్థులు ఫైనల్ అయిన తర్వాత బ్యాలెట్ పేపర్ల ముద్రణ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకుంటున్నట్లు అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు ఒక నోడల్ అధికారి నియమించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా రి-పోల్ జరగ కుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.అనంతరం పాత్రికేయులకు ఉన్న వివిధ సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు.ఈ సమావేశములో నరేందర్, సీఈఓ జడ్పీ, వీర బుచ్చయ్య, DPO పాల్గొన్నారు.



# సనాతన ధర్మంతోనే విశ్వ కళ్యాణం,దేశహితమే సంఘ లక్ష్యం

జిల్లా కార్యవాహ గోల్కొండ నాగరాజు

సూర్య,రాయికల్

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతజయంతి సందర్భంగా మంగళవారం కొత్త పేట్ గ్రామంలో గల రెడ్డీస్ ఫంక్షన్ హాల్ లో విజయదశమి ఉత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో సంఘ పరిచయం గుర్చి మాట్లాడు తూ హిందువులందరు ఐక్యంగా ఉండి పార్టీలకు అతీతంగా సనాతన ధర్మ పరిరక్షణకు పాటుప డాలని,ఆర్.ఎస్.ఎస్ లేకుంటే ప్రస్తుతం మనము మన దేశమే లేదని అన్నారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ఆర్.ఎస్.ఎస్ జిల్లా కార్యవాహ్ గోల్కొం డ నాగరాజు మాట్లాడుతూ సనాతన ధర్మంతోనే విశ్వకళ్యాణం సాధ్యమవుతుందని, దేశహితమే ధ్యేయంగా సంఘం పని చేస్తుందని,నిత్య శాఖ ల ద్వారా జాతీయ భావాలు కలిగిన దేశభక్తులను తయారు చేస్తుందని, అటువంటి మహోన్నత జాతీయవాద వ్యక్తుల ద్వారా, దేశభక్తి కలిగిన పరిపాలకుల ద్వారా దేశం అతిపెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా నిర్మితమౌతుందని, విశ్వగురు స్థానం వైపు అడుగులు వేస్తుందని, దేశ పరమవైభవ స్థితి సాధనే ధ్యేయమని అన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో



కార్యకర్తలు ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి ఆహారం, మందులు పంపిణీ చేసి వేలాది ప్రాణాలను కాపాడారని గుర్తుచేశారు. వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంఘం పలు రకాల విభాగాలతో సేవా భావంతో ప్రజలలో దాతృత్వాన్ని పెంపొందిస్తోందని అన్నారు. దేశంలో సమాజ పరివర్తన అనేది వ్యక్తి పరివర్తన ద్వారానే సాధ్యమని, ఆ పరివర్తనకు "పంచ పరివర్తన' కీలకమని అన్నారు. స్వదేశీ, పర్యావ రణ రక్షణ, కుటుంబ వ్యవస్థ బలోపేతం, సామాజిక సామరసత, పౌర విధుల ఆచరణ ఈ ఐదు అంశాలు సమాజ మార్పుకు పునాది రాళ్లు అవుతాయని చెప్పారు. అసురుల మీద దైవ శక్తి విజయం సాధించిన సందర్భమే విజయదశమి అని, చరిత్రలో ఎప్పుడైతే అధర్మం విస్తరిస్తుందో అప్పుడు మహానుభావులు అవతరిస్తారని,అదే క్రమంలో 1925 లో డాక్టర్ హెడ్గేవార్ ఆర్.ఎస్.ఎస్ స్థాపన చేసి దేశంలో ధర్మ ప్రతిష్ఠాపనకు నాంది పలికారని వివరించారు. అలాగే ఆర్.ఎస్.ఎస్ స్వయం సేవకులు సమా జాన్ని సంఘటితం చేసి 500 వందల ఏళ్ల పోరాటం తర్వాత అయోధ్యలో భవ్యమైన శ్రీరామ మందిరం నిర్మాణాన్ని సాధ్యంచేశారని, తిరుమల తిరుపతి పరిరక్షణ సమితి ద్వారా మత మార్పిడి ప్రయత్నాలను అడ్డుకున్నారని, కాశ్మీర్లో 370వ ఆర్టికల్ రద్దుకు దోహదం చేశారని ఆయన గుర్తు చేశారు. సేవా, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఆర్.ఎస్.ఎస్ ప్రపంచంలోనే అతి పెద్ద స్వచ్ఛంద సంస్థ (ఎన్జీవో)గా నిలిచిందని చెప్పారు. మన పిల్లలకు చిన్నతనం నుండే మనం సాంస్కృతి సాంప్రదాయాలు నేర్పుతూ ఆచరింపజేయ ంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖండ కార్యవాహ్ వేల్పుల స్వామి యాదవ్, కొత్తపేట కు సంఘాన్ని తెచ్చిన స్వయం సేవకులు చిలువేరి రామస్వామి,పుల్ల కిషన్, అబ్బూరి శంకర్,డాక్టర్ గంగాధర్,కడ భూమన్న, గుగ్గిలం రాము, పరుగుల శేఖర్,గుగ్గిళ్ళ రవి,తునికి నరేష్,కోల కిషన్,కోట రాజేష్,మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్,మాజీ సర్పంచ్,మాజీ ఉప సర్పంచ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సెంటినరీ కాలనీలో రాంలీల కు సన్నాహాలు

-ఏఐటియుసి, ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో

సూర్య, సెంటినరీ కాలనీ

సెంటినరీ కాలనీ రాణి రుద్రమదేవి స్టేడియంలో రాంలీల కార్యక్రమం కు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఈ స్టేడియంలో దసరా ఉత్సవాల సందర్భంగా రావణాసురుని భారీ కటౌట్ ను బాంబులతో, టపాకాయ లతో దహనం చేసి సంబరాలు జరుపుకుంటారు. గతంలో టిఆర్ఎస్



ప్రభుత్వం ఉండగా టిఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు ఈ కార్యక్రమం నిర్వహించేవారు. ప్రస్తుతం సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటియుసి, కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో ఇక్కడి సింగరేణి ప్రాతినిధ్య సంఘమైన ఐ.ఎన్.టీ.యు. సి యూనియన్ ఆధ్వర్యంలో రాంలీల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. యూనియన్ నాయకులు తమకు తోచిన విధంగా సొంత డబ్బులు పోగు చేసుకొని ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఆర్జీ-3 జీఎం నరేంద్ర సుధాకర రావు, ఏపిఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావు సంస్థ తరఫున సహకారాలు అందిస్తున్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఐఎన్ టి యు సి ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి, ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ,డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు ఆదేశాలతో ఆర్జీ-3 బ్రాంచ్ సెక్రటరీ ఎం.ఆర్. సి.రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పనులు పర్యవేక్షిస్తున్నారు. గురువారం రాత్రి స్టేడియంలో దసరా ఉత్సవాల సందర్భంగా రాంలీల కార్యక్రమంలో రావణసురుని భారీ కటౌట్ దహన కార్యక్రమాన్ని చూడదానికి వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో పాటు రత్నాపూర్, పన్నూరు, సెంటినరీ కాలనీ, కల్వచర్ల, బేగంపేట, నాగపల్లి, లద్నాపూర్ తదితర గ్రామాల నుంచి వేలాది మంది గ్రామస్తులు ఈ కార్యక్రమం తిలకించ దానికి వస్తారు.

## కాంట్రాక్టు కార్మికులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సూర్య, సెంటినరీ కాలనీ

సింగరేణి సంస్థ ఆర్జీ-2 డివిజన్ ఆర్ వి ఆర్ ప్రణవ్ ఓటీ క్యాంపు లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్వోటు జీఎం ఏ.రాముడు అన్నారు. ఓబీ క్యాంపు లో కాంట్రాక్టు కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ఎస్వోటు జీఎం ఏ.రాముడు హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థ కాంట్రాక్ట్ కార్మికుల కొరకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఏరియా ఇంజనీర్ సుజన్ మెహార్, ఏరియా రక్షణాధికారి సంతోష్, ఓసీపీ-3 ప్రాజెక్ట్ అధికారి ఉదయ్ హరిజన్, మెడికల్ సూపరింటెండెంట్ మహిపాల్, డాక్టర్ సాహితీ, ఓసీపీ-3 ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మణ్ రావు, సంక్షేమాధికారి అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ విండోలోనే అత్యధిక వడ్డీ

- మహాజన సభలో నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు

సూర్య, గంభీరావుపేట

సింగల్ విండోలోనే అత్యధిక వడ్డీ లభిస్తుం దని, నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు అన్నారు. మంగళవారం గంభీరా వుపేట మండల




కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో మహాజన సభ నిర్వహిం చారు. సహకార సంఘ సభ్యుల సౌకర్యార్థమై ఏర్పాటైన సహకార సంఘంలో 3910 సభ్యులు ఉన్న సగం మంది సభ్యులు లావాదేవీలు జరుపు కోవడం లేదన్నారు. ఖాతా తీసుకోవడంతోనే సరిపోదని ఎప్పటికప్పుడు లావాదేవీలు జరుపు తుండాలన్నారు. ఖాతా తెరిచి పదేండ్లు లావాదేవీ లు జరుపని పక్షంలో ఖాతాలోని డబ్బులు రిజర్వ్ బ్యాంకు మళ్లీ పోయే అవకాశం ఉందన్నారు. సభ్యులు క్రియాశీలకంగా ఉండి ఏదైనా విపత్తు జరిగితే కుటుంబ సభ్యులకు ప్రయోజనం కలుగు తుందని వివరించారు. సంఘ సభ్యులు లావాదేవీ లు జరపకపోవడంతో రూ.4కోట్లు రిజర్వ్ బ్యాం కు వెళ్లిపోయినట్లు తెలిపారు. సంఘంలోని 16 లక్షల వాటాదనం సంఘ సభ్యులకు త్వర లోనే పంపిణీ చేసే కార్యక్రమం చేపదుతున్నామన్నారు. సంఘం మరింత అభివృద్ధికి సభ్యులు కృషి చేయాలని కోరారు. సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలుకు రైతులు మహాజనసభ ద్వారా తీర్మానం చేశారు. సమావేశంలో మాని టరింగ్ అధికారి గౌస్,ఉపాధ్యక్షులు ఎర్ర రామాం జనేయ గౌడ్, సెస్ డైరెక్టర్ గొరవేని నారాయణ రావు, బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, కొత్తపెల్లి చైర్మన్ భూపతి సురేందర్, సీఈవో రాజిరెడ్డి, డైరెక్టర్ చెరుకూరు మురళి, రాజా వీర్, దేవా రెడ్డి, అంజిరెడ్డి, రాజిరెడ్డి, ధనరాజు, బోయిన నరసయ్య, కొమిరిశెట్టి లక్ష్మణ్లతో పాటు నాయ కులు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వెంక టస్వామి గౌడ్, దయాకర్ రావు, రాజేందర్, రాజారామ్, రాజ నర్స్, ఎగదండి స్వామి, సిబ్బం ది నాగరాజు, మహేందర్ నరేందర్ విష్ణు, దేవేందర్, మహేష్, రైతులు పాల్గొన్నారు.

## ఎంపీ ఓ ఉద్యోగానికి ఎంపికైన ఆమని


సూర్య, రామడుగు



రామడుగు మండలం కోరుటపల్లి గ్రామానికి చెందిన బుదారపు తిరుపతి గౌడ్ భాగ్య దంపతుల కూతురు బుదారపుఆమని ఇటీవల ప్రకటించిన గ్రూప్ వన్ ఉద్యోగాల్లో765 మార్కులు సాధించి ఎంపీవో ఉద్యోగానికి ఎంపికైంది.ఎంపీ ఓ ఉద్యోగాన్ని సాధించిన ఆమనిని గ్రామస్తులు అభినందించారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం

సూర్య, సెంటినరీ కాలనీ




కమాన్ పూర్ మండల కేంద్రం లోని సబ్ స్టేషన్ ఏరియాలో సద్దుల బతుకమ్మ సందర్భంగా సోమవారం నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో తీరు ఒక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలకు బహుమ తులను ప్రదానం చేశారు. ఇందులో భాగంగా బొద్దుపల్లి లక్ష్మి రాయమల్లు బతుకమ్మ మొదటి బహుమతి సాధించగా.. నామని వేణు వాణి బతుకమ్మ రెండో బహుమతి, బండారి నాగమ్మ రాజయ్య బతుకమ్మ మూడో బహుమతి అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమాన్ పూర్ ఎస్సై కొట్టె ప్రసాద్, డాక్టర్ విజయ్ కుమార్ సతీమణి విజయ, ఆపిల్ కిడ్స్ కరస్పాండెంట్ వెంకట్ రెడ్డి లు హాజరై విజేతలకు బహుమ తులను అందజేశారు. మొదటి బహుమతి ని వేణు క్లాత్ షోరూం వారు స్పాన్సర్ చేయగా, రెండవ బహుమతి వినూత్న క్లాత్ షోరూం వారు, మూడో బహుమతి బొమ్మిడి ఫ్యాషన్స్ వారు స్పాన్సర్ చేశారు. అలాగే బతుకమ్మలు పేర్చిన ఆడపడుచులందరికీ ప్రోత్సాహక బహుమతులను శ్రీ రాజరాజేశ్వర కంగన్ హాల్ అండ్ జనరల్ స్టోర్ గుల్లం జ్యోతి సతీష్ వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిన్ రెడ్డి కిషన్ రెడ్డి, చిర సత్యం, గన్నవరం రవి, బొద్దుపల్లి సాగర్, కోలేటి శ్రీనివాస్, కాసరవి, చొక్కా శ్రీనివాస్, బొద్దుపల్లి కనకయ్య, బండారి బుచ్చిబాబు, బొమ్మిడి సతీష్, జమల్ పూరి, శ్యామ్ లాల్, నామని వేణు, బొమ్మిడి బాపు, నస్పూరి బాలు, తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధి కోర్సుల శిక్షకురాలు కోసం దరఖాస్తుల ఆహ్వానం

-ఆర్జీ-3 పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం

సూర్య, సెంటినరీ కాలనీ



సింగరేణి సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ల సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిం చనున్న డిటిపి(కంప్యూటర్), స్పోకెన్ ఇంగ్లీష్, జూట్ బ్యాగ్స్ తయారీ మొదలగు నైపుణ్యాభి వృద్ధి కోర్సుల శిక్షకురాలుగా పనిచేయడానికి ఆసక్తి, అర్హత, అనుభవం గల సింగరేణి ఉద్యోగుల కుటుంబ మహిళలు, పరిసర గ్రామాల మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దరఖాస్తుతో పాటు సంబంధిత విభాగంలో అనుభవ ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు జతచేసి రామగుండం-3 ఏరియా జీ.ఎం.కార్యాలయంలోని పర్సనల్ విభాగం నందు తేది: 08.10.2025. సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని కోరారు. ఇతర వివరాలకై ఏరియా పర్సనల్ విభాగం నందు సంప్రదించాలని తెలిపారు.

## వైభవంగా "పల్లకి సేవ"

సూర్య, రామడుగు



రామడుగు మండల కేంద్రంతోపాటు వన్నారం గ్రామంలో మంగళవారం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా పల్లకి సేవను వైభవంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా అర్చకులు దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవత పల్లకి సేవ ప్రత్యేక అభిషేకాలు అలంకరణ లుపూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి మహిళలు కోలాటం మేళతాళాల మధ్య వీధి వీధినా చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామడుగు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి హరీష్ భరత్ అజయ్ సాయి ప్రేమ్ సాగర్ రాజు సూర్యప్రకాష్ దీపక్ కుమార్ సిరికొండ మధు, తలారి మణిదీప్, శ్రావణ్, అభిలాష్, శివ, రమేష్, రవి జవ్వాజి అజయ్ రాము కన్ని సన్నీ తదితరులు పాల్గొన్నారు.

### రామగిరి ఖిల్లాలో
# 210 ఎకరాల భూసేకరణకు 6వ తేదీన అవార్డు విచారణ

**సూర్య, సెంటినరీ కాలనీ**

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రామగిరి ఖిల్లా మేడిపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ పట్టా భూములపై ఈ నెల 6వ తేదీన అవార్డు విచారణ జరుగుతుందని మంథని ఆర్డీవో భూసేకరణ అధికారి కాసబోయిన సురేష్ నోటీసులు జారీ చేశారని రామగిరి తహసీల్దార్ పర్శంది సుమన్ తెలిపారు. గ్రామ ప్రజలకు తెలియజేయునది ఏమనగా మీ యొక్క మేడిపల్లి గ్రామం లో ఎ. 210-27 గుం.ల భూమికి సంబందించి రామగిరి తహశీల్దార్ కార్యాలయం వద్ద విచారణ కొనసాగుతుంది. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ప్రొ. %+%1/2042/2024, తేదీ: 29.08.2025 క్రమము ఉదయం 11.00 గంటలకు అవార్డు విచారణ నిర్వహించబడును. షెడ్యూల్ క్రమము నోటీసు వెలువడిన తేది నుండి (30) దినములలో మీకు సంబంధించిన డాక్యుమెంట్ల యుక్తముగా హక్కుదారులు, భూమిలో ప్రమేయం ఉన్న వారు, స్వయంగా గాని, ప్రతినిధి ద్వారా గానీ, లాయర్ ద్వారా గానీ హాజరు కావచ్చును. సదరు భూమిపై తమకు ఏ విధంగా హక్కులు ఉన్నవి, ఎంత పరిహారం రావలసినది అను విషయములో అర్జులైన వారంతా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే సెక్షన్ 20 క్రింద చేపట్టిన భూమి కొలతలకు సంబంధించి తమకు గల అభ్యంతరములు తెలుపుకోవచ్చును. సంబంధిత హక్కుదారులు అవార్డు విచారణ జరుగు ప్రాంతములో కానీ ఈ క్రింద సంతకం చేసిన అధికారి కార్యాలయంలో కార్యాలయ పని వేళలలో అందజేయవచ్చును. 06.10.2025 తేదీన తదుపరి అవార్డు ప్రకటించబడును. గడువులోగా అవార్డు విచారణకు రాని వారి యొక్క నష్టపరిహారం కార్యాలయ రికార్డు క్రమము భూసేకరణ పునరుపాది, పునరావాస కల్పనలకు పారదర్శకత, హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013 (చట్టం నెం. 30/2013) క్రమము అవార్డు ప్రకటించబడును. మేడిపల్లి శివారులోని ఈ కింద పొందుపరిచిన సర్వే నెంబర్లలో పట్టా, ప్రభుత్వ భూములను తీసుకోవడానికి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేయడం, అన్నీ కార్యాలయాల వద్ద బోర్డులపై అతికించడం జరిగింది. ఈ మేరకు రత్నాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో వివరాలతో కూడిన నోటీసును అందించారు. మేడిపల్లి శివారు లోని సర్వేనెంబర్ లు 70, 71, 72, 73, 74, 76, 77, 104, 108, 109, 110, 111, 117, 118, 119, 120, 121, 123, 130, 133, 134, 137, 144, 145, 146, 147, 148, 149, 150, 151, 152, 153, 154, 155, 156, 157, 158, 159, 160, 161, 162, 163, 164, 165, 166, 167, 168, 169, 170, 171, 172, 173, 174, 175, 176, 177, 178, 179, 180 భూ-చట్టం "ఇండస్ట్రియల్ పార్క్/ ఎంఎస్ఎంఈ పార్క్ స్థాపన" లో ఈ భూములు తీసుకుంటున్నారు. 210 ఎకరాల 27 గుంటల భూమిని అవసర నిమిత్తం 03-02-2025న తెలంగాణ గెజిట్ నం.01/2025 యొక్క పార్ట్-%×% పేజి 1-28 లో ప్రచురించబడిన భూసేకరణ, పునరావాసం, పునరావాసంలో పరిహారం, పారదర్శకత హక్కు (తెలంగాణ సవరణ) చట్టం-2016 (2017 యొక్క చట్టం నెం.21) ద్వారా సవరించబడింది. భూసేకరణ, పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం, 2013 (2013 యొక్క కేంద్ర చట్టం 30)లోని సెక్షన్-11 కింద నోటిఫికేషన్ ప్రకారం ప్రచురించబడింది. భూమిపై ఆసక్తి ఉన్న వారందరూ స్వయంగా లేదా వారిచే అధికారం పొందిన వ్యక్తి ద్వారా 12-09-2025న సాయంత్రం 04.00 గంటలకు పెద్దపల్లి కలెక్టర్, చర్చల కమిటీ ముందు హాజరై తమ వాదనలు వినిపించిన విషయం విదితమే.



## మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ 60వ జన్మదిన వేడుకలు

**- కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేసిన బిఆర్ఎస్ నాయకులు**

**సూర్య, చిగురుమామిడి**

చిగురు మామిడి మండల కేంద్రంలో బి.ఆర్.ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ మాజీఎమ్మెల్యే వొడితేల సతీష్ కుమార్ 60వ జన్మదిన వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి హాజరై కార్యకర్తలు,నాయకులు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లను,పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం శ్రమించిన మాజీఎమ్మెల్యే సతీష్ కుమార్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.రెండుసార్లు హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొంది పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా నిరంతరం పనిచేశారనిచెప్పారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా సతీష్ కుమార్‌ను గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నాయకులు పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చెయ్యాలన్న లక్ష్యంతో పనిచేశారని,భవిష్యత్తులో సతీష్ కుమార్ మంత్రిగా హుస్నాబాద్ నియోజకవర్గానికి మరెన్నో సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకట రమణారెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి,మాజీ వైస్ఎంపీపీ బేతి రాజిరెడ్డి,మాజీమండల అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి,నాయకులు మిట్టపల్లి మల్లేశం,పెనుకుల తిరుపతి, కత్తుల రమేష్,బెజ్జంకి రాంబాబు,జక్కుల రవీందర్, పెద్దపల్లి అరుణ్,సన్నీల్ల వెంకటేష్,హనుమ్ల సత్యనారాయణ,పెసరి రాజేశం,ముక్కెర సదానందం,బుర్ర తిరుపతి గౌడ్,పిల్లి వేణు,శ్యామకూర సంపత్ రెడ్డి, కాలువల సంపత్ రెడ్డి, తోడేటి శ్రీనివాస్,బోయిని రమేష్,అన్నాడి మల్లికార్జున్ రెడ్డి,గీట్ల తిరుపతిరెడ్డి, చింతపుల అంజయ్య, సన్నీల మల్లేష్,పిల్లి రమేష్,బోయిని మనోజ్,కూతురు శరబద్దన్ రెడ్డి,గడ్డం సాగర్ రెడ్డి, కార్యకర్తలు,నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## భవాని స్వాములకు అన్నప్రసాద వితరణ చేసిన వ్యాళ్ల హరీష్ రెడ్డి

**సూర్య-గోదావరిఖని**

పట్టణంలోని శ్రీ జయ దుర్గా దేవి ఆలయంలో భవాని దీక్ష మాల ధారణ స్వాములకు మంగళవారం విహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి, ఆయన సతీమణి శ్రావ్య హరీష్ రెడ్డి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. రామగుండం నియోజకవర్గంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. రామగుండం నియోజకవర్గ ప్రజలపై అమ్మలగన్న అమ్మ జయ దుర్గ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అమ్మవారి కంకణదీక్షా పరులు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అమ్మవారి సేవలో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం లో జయ దుర్గ ఆలయాన్ని నిర్మించి పారిశ్రామిక ప్రాంతంలో భక్తి విరాజిల్లేలా కృషి చేస్తున్నారని వారి సేవలను కొనియాడారు. ఎంతో భక్తిశ్రద్ధలతో భవాని మాల ధారణ చేసి అమ్మవారి స్మరణలో పాల్గొంటున్న భవాని మాలాధీక్షాపరులకు అన్న ప్రసాదం వితరణ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ అంతర్గాం జడ్పీటీసీ అముల నారాయణ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మూల విజయ రెడ్డి, జాహిద్ పాషా, సిగిరి రాము, పోలాడి శ్రీనివాస్ రావు, నడిపెల్లి సాయి, వంశీకృష్ణ, పోయిల రవి, కొండా సురేష్, రవీంద్ర చారి, బొడిగె శ్రీనివాస్, యుగంధర్, మొలుగూరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇక్కడి 25వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజును వ్యాళ్ల హరీష్ రెడ్డి కలిసి స్థానిక రాజకీయాలపై చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## అమ్మ వారి సేవలో రాష్ట్ర ప్రభుత్వ విప్ "ఆది"

**సూర్య, చందుర్తి**

చందుర్తి మండలం మల్యాల గ్రామం లోని శరన్నవరాత్రుల సందర్భంగా హిందూ వాహిని వారి ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గ మాత అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు ముస్కు ముకుంద రెడ్డి, ఈసరి శ్రీనివాస్,, పత్తిపాక శంకర్, తిరుపతి, యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

**సూర్య, బోయినపల్లి**

ఆస్ట్రేలియా పర్యటన దిగ్విజయంగా పూర్తి చేసుకొని స్వదేశానికి విచ్చేసిన చొప్పదండి ఎమ్మెల్యే సత్యం ను మంగళవారం మర్యాద పూర్వకంగా తడగొండ కాంగ్రెస్ నాయకులు కలవడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ గుడి రాజశేఖర్ రెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ గుడి శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎండి హుస్సేన్, ఆటో యూనియన్ అధ్యక్షులు కొండ శంకర్, కాడే భాస్కర్, వెంకటరమణ, రాజేష్, రఫీ, చంద్రరెడ్డి, చేపూరి లక్ష్మణ్, శంకర్, భూమేష్, ఎర్ర రవి, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అమెరికాలో బతుకమ్మ పండుగ వేడుకలు

**- తెలంగాణ ఆడపడుచుల సంబరాలు**

**సూర్య, వేములవాడ**

తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆధ్వ ర్యంలో బతుకమ్మ వేడుకలను అమెరికా లోని ఆస్టిన్‌లో హిందూ టెంపుల్ కమ్యూనిటీ పార్క్‌లో తెలంగాణ సంస్కృతి సాంప్రదా యాలు ఉట్టిపడేలా అత్యంత కోలాహలంగా కన్నుల పండు గగా బతుకమ్మ పండుగ వేడుకలను నిర్వహించారు. బతుకమ్మ సాంప్రదాయ పాటలతో మహిళలు, చిన్నారులు, యువతులు చిన్న పెద్ద తేడా లేకుండా అందరు ఆటపాటలతో డిజె సప్పుల తో బ్యాండ్ బాజాలతో ఎంతో హుషారుగా బతకమ్మ పండగ వేడుకలు అంబరాన్నంటాయి. భారతదేశం నుండి వచ్చిన స్థానికుల తల్లిదండ్రులు, బంధువులు కూడా ఈ వేడుకలలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని కమిటీ సభ్యులు తమ సంతోషాన్ని తెలియజేశారు. ఈ సంబరాల్లో ఆస్టిన్ స్థానికులతో పాటు ఎంతో మంది అతిథులు ఎన్నారైలు నివసిస్తున్న తెలుగు వారందరికీ స్థానికులకు బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను తెలియజేస్తు బతుకమ్మ వైభవాన్ని చాటిచెప్పుతూ తెలంగాణ కల్చరల్ సొసైటీ చరిత్రలో నిలిచిపోవడం జరిగిందని సొసైటీ సభ్యులు అన్నారు. ఇతర సంస్థలు కూడా బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి

**సూర్య, జగిత్యాల అర్బన్**

జగిత్యాల పట్టణం లోని శ్రీ లోక మాత పోచమ్మ తల్లి దేవాలయం లో మంగళవారం నాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని అమ్మవారిని మాజీ మంత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు మాజీ మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఆలయ కమిటీ సభ్యులు ములస్తం మునిందర్, నాయకులు రమేష్ రావు, రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, రవీందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నవ దుర్గ పీఠ క్షేత్రంలో అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు

**సూర్య, జగిత్యాల టౌన్**

దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జగిత్యాల పట్టణంలోని స్థానిక గోవింద పల్లె లో శ్రీ నవదుర్గ పీఠ క్షేత్రంలో అమ్మవారిని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా.బోగ శ్రావణి ప్రవీణ్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా దిశా కమిటీ మెంబర్ పాత రమేష్, జగిత్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, కాశెట్టి తిరుపతి, దూరిశెట్టి మమత, కౌడు వెంకన్న, మామిడాల కవిత రాజగోపాల్, బద్దెల గంగారాజం నవదుర్గ సేవా సమితి సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి పల్లకిసేవ

**- ప్రత్యేక పుజలు నిర్వహించిన భక్తులు**

**సూర్య, ఇబ్రహీంపట్నం**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బజరంగ్దళ్ సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో మంగళవారం భక్తులకు అమ్మవారు దుర్గ మాతగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భవాని దీక్ష పరులు, భక్తులు అమ్మవారికి వివిధ రకాల అలంకరణ చేసి అర్చకుల సహకారంతో పంచామృత అభిషేకాలు, అష్టోత్తరాలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.